


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త




epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

29-9-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 240 పేజీలు: 16 వెల: 6.50





సోమవారం పల్లెపండుగపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

# రూ.11,085 కోట్లతో పల్లె పండుగ

>>అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం పల్లె పండుగ 3.0లో భాగంగా 11,085 కోట్లతో గ్రామాల్లో వివిధ మౌలిక వసతుల అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. సిసి రోడ్లు, బిటి రోడ్లు, మినీ గోకులాలు, ఉద్యాన పంటల కాంపౌండ్లు, మ్యాజిక్ డ్రైన్లు, బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పల్లె పండుగ 3.0కు ఉదయగిరిని వేదికగా ఎంపిక చేయడానికి అక్కడి భౌగోళిక పరిస్థితులు, నీటిపారుదల వసతులు ప్రధాన కారణాలని మంత్రి తెలిపారు. ఉదయగిరి ప్రాంతం ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో నీటిని తీసుకురావడానికి లిఫ్ట్ ఇరిగేషన్ అవసరమని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని కొన్ని మండలాలకు నీరు అందేలా చర్యలు చేపట్టినట్లు, మిగిలిన మండలాలకు కూడా నీటిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నాలు కొనసాగిస్తోందన్నారు. ఈ నెల 29న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉదయగిరికి చేరుకుని పల్లె పండుగ 1.0, 2.0లో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలిస్తారని మంత్రి తెలిపారు. అనంతరం పల్లె పండుగ 3.0లో మంజూరైన పనులకు శంకుస్థాపన చేసి, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నట్లు మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.

## సబ్‌కలెక్టర్లుగా ఐఎఎస్ ప్రొబేషనర్లు నియామకం

>> సీతారామరాజు జిల్లా పాడేరు సబ్‌డివిజన్ సబ్‌కలెక్టర్‌గా కనాల చిరంజీవి నాగవెంకట సాహిత్ పోస్టింగ్ పొందారు. పోలవరం జిల్లా రంపచోడవరం సబ్‌డివిజన్ సబ్‌కలెక్టర్‌గా దొణక పృథ్వీరాజ్ కుమార్, చింతూరు సబ్‌డివిజన్ సబ్‌కలెక్టర్‌గా చిత్తపులి నరేంద్ర పడాల్ నియమితులయ్యారు. ఈ బాధ్యతల నుండి శుభమ్ నోఖ్వాల్‌ను పూర్తి అదనపు బాధ్యతల (ఎఫ్ఎసీ) నుండి విముక్తి చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం సబ్‌డివిజన్ సబ్‌కలెక్టర్‌గా సచిన్ రాహర్, అనంతపురం జిల్లా పెనుకొండ సబ్‌డివిజన్ సబ్‌కలెక్టర్‌గా ఫరీన్‌జహీద్ పోస్టింగ్ పొందారు. మనీషా నంద్యాల జిల్లా నంద్యాల సబ్‌డివిజన్ సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు. మరోవైపు, పోలవరం జిల్లా చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న శుభమ్ నోఖ్వాల్ బదిలీపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సబ్‌డివిజన్ సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు. సంబంధిత సబ్‌డివిజన్ల డిప్యూటీ కలెక్టర్లు/రెవెన్యూ డివిజనల్ అధికారులను సాధారణ పరిపాలన శాఖ కు రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.

# ఆక్వా వ్యర్థాల అనర్థాలు నివారించండి

>> ఉల్లంఘనలకు పాల్పడే యూనిట్లపై పర్యావరణ చట్టాల మేరకు నియంత్రణ చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డి.సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "కాలుష్యాన్ని మూలంలోనే గుర్తించి, నివారించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాలు నదులు, కాలువలు, చెరువులు, సాగర సంగమ ప్రాంతాలు, భూగర్భ జలాలతో పాటు ఇతర జల వనరులపై ప్రతికూల ప్రభావం చూపకుండా చర్యలు తీసుకోవడం అత్యంత అవసరం. వ్యర్థ జలాల్లో బిఓడి స్థాయిలు అధికంగా ఉంటే నీటిలో కరిగిన ఆక్సిజన్ శాతం తగ్గి జలచర జీవ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా మత్స్య సంపదపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అలాగే టిఎస్ఎస్ స్థాయిలు పెరగడం వల్ల నీటి నాణ్యత క్షీణించి, జలచర జీవుల ఆవాసాలు ప్రభావితమవుతాయి. అసాధారణ పిహెచ్ స్థాయిలు కూడా జలచర జీవులపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. నీటి నాణ్యత క్షీణించడం వల్ల మత్స్య సంపద, వ్యవసాయం, పశుపోషణతోపాటు నీటి వనరులపై ఆధారపడిన జీవనోపాధులు దెబ్బతినే ప్రమాదం ఉంది. జల వనరుల వినియోగ సామర్థ్యంపై ప్రభావం పడి ప్రజారోగ్యానికి ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉంది. ఆక్వా ప్రాసెసింగ్, ప్రిప్రాసెసింగ్ యూనిట్లలో క్రమం తప్పకుండా నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించడం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి నివారించే దిశగా చర్యలు చేపట్టాలని, యూనిట్లకు దిద్దుబాటుకు అవకాశం కల్పిస్తూ, ఉల్లంఘనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆక్వా యూనిట్లు పర్యావరణ ప్రమాణాలు సమర్థవంతంగా పాటించేలా చేయడమే లక్ష్యం" అని స్పష్టం చేశారు.

## పడిపుట్లబైలులో ఏనుగుల సంచారం: 'కుంకీలను దించండి

## నిఘా పెట్టండి, ప్రజల్ని అప్రమత్తం చేయాలి

### పంట నష్టం జరిగిన రైతులకు తక్షణం పరిహారం

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** చిత్తూరు జిల్లా, పడిపుట్లబైలు సమీపంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపును అడవిలోకి మళ్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ఆపరేషన్ చేపట్టాలని సూచించారు. హనుమాన్ బృందాలు, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖల సమన్వయంతో ఏనుగుల కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సోమవారం పడిపుట్లబైలు ఏనుగుల సంచారంపై అటవీ శాఖ అధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వడంతోపాటు పరిసర గ్రామాల్లో మానవ-ఏనుగు ఘర్షణలు తలెత్తకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గత 15 రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, గుంపు నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో వ్యవసాయ పంటలకు నష్టం కలిగిస్తున్నట్టు రైతులు ఆవేదనలో ఉన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఒక ఏనుగుల గుంపు రహదారిని దాటి మంగళంపేట బీట్‌లోకి ప్రవేశించగా, మరో రెండు ఏనుగులు కూడా రహదారి దాటి చిత్తూరు వైపు కదులుతున్నట్టు వివరించారు. ఈ ఏనుగుల సంచారం పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పుగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డి.సిఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. "ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ఏనుగుల కదలికలను పోలీసు, రెవెన్యూ, విద్యుత్, తత్సంబంధిత తదితర శాఖలు, హనుమాన్ బృందాలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షి ంచాలి. అలాగే, క్షేత్రస్థాయి బృందాలు నిరంతర నిఘా కొనసాగిస్తూ, ప్రమాదానికి అవకాశం ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి. సాధ్యమైన చోట ఏనుగుల కారణంగా ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకోవాలి. వాటిని సురక్షి తంగా తిరిగి అటవీ ప్రాంతాల వైపు మళ్లించే చర్యలు చేపట్టాలి. ప్రజల భద్రత, వ్యవసాయ పంటల పరిరక్షణ, మానవ-ఏనుగు ఘర్షణల నివారణ, వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని డి.సిఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# 'విజయవాడ ఉత్సవ్' ప్రతీక

>> ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. అంతరించిపోతున్న తోలుబొమ్మలాట, డప్పు, తప్పెటగుళ్ల వంటి జానపద కళారూపాలు, పౌరాణిక పద్య నాటకాలను పరిరక్షించడంతో పాటు కళాకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కళలు యువతలో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ విజయవాడకు ఘనమైన చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాశస్త్యం ఉందన్నారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా కనకదుర్గమ్మ ఆశీస్సులతో పది రోజుల పాటు ప్రజలంతా సోదరభావంతో ఉత్సవాలను జరుపుకోవాలనే సదుద్దేశంతో ఎంపి కేశినేని చిన్ని ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక ఆర్థిక వ్యవస్థతో పాటు జిల్లా స్థూల ఉత్పత్తి (డిజిడిపి) కూడా పెరుగుతుందని తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్న మంత్రి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.
పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో తొలిసారిగా విజయవాడ పున్నమి ఘాట్‌లో అక్టోబరు 8 నుంచి 23 వరకు జాతీయ స్థాయి సరస్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా డ్వాక్రా, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం 650 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దసరా నవరాత్రుల్లో కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు విజయవాడ ఆతిథ్యాన్ని, నగర సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 11 నుంచి 20 వరకు 'విజయవాడ ఉత్సవ్2.0'ను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, గద్దెరామ్మోహన్, వెనిగండ్ల రాము, శాసన మండలి సభ్యులు వర్ల రామయ్య, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌పట్టాబిరామ్, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీ శ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎమ్, తదితరులు పాల్గొన్నారు.

# హామీలన్నీ అమలు చేస్తా..

>> ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎవ్వరూ ఊహించని రీతిలో రాష్ట్రంలోనే తొలిసారిగా ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. వచ్చే సంవత్సరం మొదటి మూడు నెలల్లో ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకి అంకితం చేసే బాధ్యత మేం తీసుకుంటాం. మహానాడు కట్టకి రిటైనింగ్ వాల్, భూగర్భ డ్రైనేజి, తాగునీటి సమస్యకు శాశ్వతమైన పరిష్కారం కావాలని ఎన్నికల సమయంలో అడిగారు. వాటిని ప్రణాళికా బద్ధంగా చేపట్టి, పూర్తిచేస్తాం. అత్యధిక మెజారిటీ నా బాధ్యత పెంచింది.. రాష్ట్రా నికి దిక్సూచిగా మంగళగిరి మోడల్‌గా అభివృద్ధి చేస్తా.. నాపై ఉంచిన నమ్మకానికి రుణం తీర్చుకుంటా అని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా గత ఎన్నికల్లో నన్ను గెలిపించినట్లుగానే కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి మంచి మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

**ఎక్కువ హామీలు ఇవ్వను...ఇచ్చినవన్నీ నిలబెట్టుకుంటా:** "నేను ఎక్కువ హామీలు ఇవ్వను. కానీ ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుంటా. డోర్ టు డోర్ కార్యక్రమం సమయంలో మీరు చెప్పిన సమస్యలన్నీ రాసుకున్నా. ప్రతిదీ నేను మానిటర్ చేస్తున్నా. పురోగతిపై ప్రతి వారం సమీక్ష చేస్తున్నా. దాంట్లో భాగంగా ఇంటి పట్టాల కార్యక్రమం చేపట్టాం. ఇంకా చేయాల్సిన కార్యక్రమాలు ఉన్నాయి. యుద్ధ ప్రాతిపదికగా చేయాల్సిన పనులన్నీ తొలుత చేపడుతున్నాం. భూగర్భ డ్రైనేజి, పైప్ లైన్ ద్వారా తాగునీరు, అండర్ గ్రౌండ్ గ్యాస్ పైప్‌లైన్ ప్రక్రియ పూర్తయిన చోట వెంటనే రోడ్లు వేస్తాం అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలో 2029 ఎన్నికల లోపు ప్రతి గడపకి తాగునీటి కనెక్షన్, అండర్ గ్రౌండ్ గ్యాస్ కనెక్షన్, భూగర్భ డ్రైనేజి పూర్తిచేసే బాధ్యత నేను తీసుకుంటా, ఆనాడు ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉన్నానని మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, టిటిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆకుల జయసత్య, టిడిపి గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి పట్టణ టిడిపి అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టిడిపి అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, రూరల్ అధ్యక్షుడు దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ 'ప్లేవర్' లేని కాలీప్లవర్

>> అవుతుంది. ఇక రవాణాకు 5 నుంచి పదివేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఒక ఎకరానికి సుమారు 9 వేల కిలోల పంట చేతికి వస్తుంది. కిలో పది రూపాయలకు విక్రయిస్తే ఖర్చులు పోను సుమారు 30 వేల మిగులుతాయి. అయితే ప్రస్తుతం రెండురూపాయలు ధర పలకడంతో కూలీల ఖర్చు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సెప్టెంబర్ పలమనేరు మార్కెట్‌లో కాలీప్లవర్ ధర క్వింటాల్‌కు మూడు వందల నుంచి నాలుగు వందలు పలికింది. కాలిప్లవర్ అధికంగా సాగుచేసే ఆదిలాబాద్‌లో కూడా దాదాపు ఇదే పరిస్థితి కనిపించింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాలీప్లవర్ పాడైపోయే కూరగాయ కావడంతో రైతుకు ఎక్కువ రోజులు నిల్వ చేసుకునే అవకాశం ఉండదు. ధర తగ్గితే అయినకాడికి అమ్ముకునే దుస్థితిలో ఉన్నారు. సాగు ఖర్చులు పెరగడం, విత్తనాలు, నారు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చు, నీటి పారుదల, రవాణా ఖర్చులు పెరగడం వల్ల రైతు పెట్టుబడి పెరుగుతోంది. మార్కెట్‌లో కాలిప్లవర్ ధర ఇటీవల కాలంలో తీవ్ర హెచ్చుతగ్గులు ఉండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో రైతులు పూర్తిగా మధ్యవర్తులపై ఆధారపడటం వల్ల ఆశించిన మేరకు ధర లభించడం లేదు. చిన్న రైతులకు నేరుగా పెద్ద మార్కెట్లు లేదా వినియోగదారులకు అమ్మే అవకాశం తక్కువగా ఉన్నాయి. దీంతో స్థానిక వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లపై ఆధారపడాల్సి వస్తుంది. నిల్వ సదుపాయాల కొరతతో ఎక్కువ కాలం నిల్వచేయడం సాధ్యం కాకపోవడంతో ధర తగ్గినప్పుడు కూడా అమ్మక తప్పని పరిస్థితి ఎదురౌతోంది. ముఖ్యంగా ఈ పంటకు వాతావరణ పరిస్థితులు సహకరించాలి. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం వల్ల ఆశించిన మేరకు వర్షాలు కురవడం లేదు. అయినప్పటికీ దిగుబడి సాధిం చేందుకు రైతులు అనేక అవస్థలు పడ్డారు. ఆశించిన మేరకు పంట దిగుబడిని సాధించేందుకు ఎరువులు, క్రిమి సంహారక మందుల కోసం ఎకరానికి సుమారు పది వేల రూపాయల వరకు ఖర్చు చేశారు. గత దశాబ్దకాలంగా చూస్తే ఇప్పటికి నాలుగైదు సార్లు ఇలాంటి పరిస్థితి ఎదురైంది. మరోసారి ధరలు తగ్గిపోతే కాలిప్లవర్‌ను సాగును పూర్తిగా నిలిపివేసే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని తమకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.




సోమవారం గువహతిలో సిఐటియు కార్మికులు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

## అలిపిరి వద్ద రూ.500 కోట్లతో భారీ టౌన్‌షిప్!

>>ఏర్పాటు చేయడం వల్ల వసతి, దర్శన కౌంటర్లు అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 30వేలమంది వరకు భక్తులు ఈ క్యాంప్‌లోనే ఉండేందుకు వీలుంటుంది. అలిపిరి పాత చెక్‌పోస్టు ప్రాంతంలో సమీప స్థలాలను కలుపుకుని శిల్పకళాశాల ప్రాంతంలో ఈ బేస్‌క్యాంపు ఏర్పాటుకు స్థలాల పరిశీలన జరిగింది. భక్తులకు సంతోషకరమైన దర్శనం తోబాటు సంతృప్తికర వసతి కల్పించేందుకు బేస్‌క్యాంపు ప్రధానంగా నిలవనుంది. దేశంలోని పలుప్రాంతాల నుండి తిరుపతికి చేరుకునే ప్రైవేటు వాహనాలు, యాత్రికుల వాహనాలను అలిపిరి బేస్‌క్యాంపుకు అనుసంధానం చేసి, ఇక్కడ వసతి కల్పించడం వల్ల శేషాచలం అడవిలో కొలువైన తిరుమలకు వాహనాలు కాలుష్యం, పర్యావరణ పరిరక్షణకు మార్గం సులభమవుతుందని భావిస్తున్నారు. అలిపిరి నుండి భక్తులను ఆర్టీసి విద్యుత్ బస్సుల ద్వారా తిరుమలకు చేరవేయనున్నారు.

## ఫ్రీహోల్డ్ భూములపై నిషేధాన్ని ఎత్తివేయాలి

>>గెజిట్ వివరాలను యజమానులకు తెలియజేసే ఆన్‌లైన్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. భూముల తొలగింపునకు వచ్చే దరఖాస్తుల పరిశీలన, విచారణ మరియు నిర్ణయ ప్రక్రియకు స్పష్టమైన కాలపరిమితిని నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు.

## ఖైరతాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానం ఖాళీపై గెజిట్ విడుదల

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతకు గురైనట్లు తెలంగాణ శాసనసభ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు శాసన సభ కార్యదర్శి రెండ్ల తిరుపతి ఈ నెల 26న ప్రకటనల జారీ చేశారు. తెలంగాణ హై కోర్టు ఈ నె ల18న ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా దానం నాగేందర్ అనర్హతకు గురయ్యారు. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయన అనర్హత అమల్లోకి వచ్చినట్లు అదే తేది నుంచి ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు శాసన సభ నోటీపై చేసింది. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవరాన్గికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు వీలుగా ఎమ్మెల్యే స్థానం అధికారకంగా ఖాళీ అయినట్లు స్పష్టమైంది.

## వారం - వర్జ్యం

29-09-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, చిత్త కార్తె
తి. తదియ సా.5.08, న. అశ్విని ఉ.9.02
వ.సా.6.04 - రా.7.34
దు.ఉ.8.21 - ఉ.9.09
2) రా.10.47 - రా.11.35
రాహు. మ.3.00-4.30 శుభ స. ఉ.6.00 - ఉ.7.00

## వార్తాఫలం

**మేషం:** పలుకుబడి హోదా పెంపొందుతాయి. అలవాట్లలో మార్పులు చేస్తారు. గోప్యతకు ప్రాధాన్యతనిస్తారు.

**వృషభం:** క్రయవిక్రయాలలో మధ్యవర్తులను ఆశ్రయిస్తారు. కీళ్ళ నొప్పులు బాధిస్తాయి. రహస్య ఋణాలను చేస్తారు.

**మిథునం:** చిన్నవిషయాలపైన కూడా శ్రద్ధను కనబరుస్తారు. సన్నిహితుల సహాయ సహకారాలను సంపూర్ణంగా అందుకుంటారు.

**కర్కాటకం :** వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారు. వినోద కార్యక్రమాలలో చురుగ్గాపాల్గొంటారు. విదేశీయాన ప్రయత్నాలు కలిసి వస్తాయి.

**సింహం :** బాధ్యతలకు ప్రాధాన్యతనిచ్చి కుటుంబ అవసరాలపైన దృష్టిని సారిస్తారు. ఉద్యోగ యత్నాలు కలిసి వస్తాయి.

**కన్య :** ఎలక్ట్రానిక్ మీడియాపట్ల అమితంగా ఆకర్షితులవుతారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి అడుగును జాగ్రత్తగా వేస్తారు.

**తుల :** వ్యవహారాలలో ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరమ వుతుంది. వినోద కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు.

**వృశ్చికం :** సన్నిహితుల సహాయ సహకారాలను సంపూర్ణంగా అందుకుంటారు. సౌందర్య సాధక చిట్కాల పట్ల ఆకర్షితులవుతారు.

**ధనుస్సు:** సహోదర, సహోదరీ వర్గానికి మీ వంతు సహాయ సహకారాలను అందిస్తారు. అధికంగా శ్రమిస్తారు.

**మకరం:** శత్రువర్గం నుండి పరోక్షంగా చికాకులను ఎదుర్కొంటారు. దిశా, దశ లేకుండా ఆలోచనలు సాగిస్తారు.

**కుంభం:** ఆత్మసాక్షికి విరుద్ధంగా ఏపనీ చేయరు. వ్యాపారస్తులకు నేడు అనుకూలంగా ఉంది. మధ్యవర్తులను ఆశ్రయిస్తారు.

**మీనం :** మీరు చేసే మంచి పనికి గాను ప్రోత్సాహం లభిస్తుంది. పరోపకార బుద్ధిని కలిగి ఉంటారు. అధికంగా శ్రమిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్‌కు పదోన్నతి

## సుప్రీంకోర్టుకు ముగ్గురు హైకోర్టు సీజేలను సిఫారసు చేసిన కొలీజియం

### మళ్లీ తెలంగాణ హైకోర్టుకు జస్టిస్ టి.వినోద్‌కుమార్ రాక

**హైదరాబాద్, సెప్టెంబరు28, ప్రభాతవార్త:** సుప్రీం కోర్టుకు కొత్తగా ముగ్గురు న్యాయమూర్తులు రానున్నారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో సోమవారం సమావేశమైన కొలీజియం మూడు రాష్ట్రాల హైకోర్టుల సీజేల పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సోమవారం నిర్ణయించింది. వీరిలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ ఉన్నారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీఎస్ నరసింహ సుప్రీంకోర్టు కొలీజియంలో సభ్యులుగా ఉన్నారు. సుప్రీం కోర్టులో మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 38 కాగా, ప్రస్తుతం 34 మంది న్యాయమూర్తులు ఉన్నారు. ఈ సిఫార్సులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేసిన తర్వాత కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ వీరి నియామకాల ఉత్తర్వుల్ని జారీ చేస్తుంది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, 2023 జూలై నుంచి గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

# పోలీసులకు సవాల్‌గా వరుస కిరాతక హత్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరుస బహిరంగ హత్యలు పోలీసులకు సవాల్‌గా మారుతు న్నాయి. చిన్నపాటి తగాదాలు మొదలుకుని, భూవివా దాలు, కుటుంబసభ్యుల హత్యకు ప్రతీకారంగా జరుగు తున్న దారుణాలు ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్నాయి, హత్యల తరువాత తాపీగా పోలీసులకు లొంగిపోతున్న నిందితులు ఆ తరు వాత కోర్టుల నుంచి బెయిలు పొందుతూ ఆనక దర్జాగా మళ్లీ నేరప్రవృత్తిలో కొనసాగుతున్నారు. హత్యలతోపాటు హత్యాయత్నం వంటి తీ వ్రమైన కేసుల్లో నిందితులకు సులభంగా బెయిలు లభిస్తుండడం ఒక ఎత్తయితే చాలా కేసుల్లో నిందితులకు కఠినశిక్షలు వేయించడంలో విఫలమవు తుండడం ఈ తరహా నేరాల పెరుగుదలకు కారణమని నిపుణులు అంటున్నారు. రాష్ట్రంలో యేటా 800 వరకు హత్యలు జరుగుతుండగా ఇందులో జంట నగరాలు, శివార్లలో 300 వరకు ఉంటున్నాయి. హత్యా నేరాలకు పాల్పడే వారిని పోలీసులు అరెస్టు చేస్తున్నా నిందితులను కర్ణాటకతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో వున్నట్లుగా కనీసం యేడాది నుంచి యేడాదిన్నరపాటు జైల్లో నిర్భంధించ లేకపోవడం చట్టాల వైఫల్యంగా చెప్పాలి. హత్యల వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులపై మోపుతున్న అభియోగాలు కోర్టుల్లో చాలా సందర్భాల లో నిలబడడం లేదు.
ఈ కారణంగా నిందితులు నిర్దోషులుగా విడుదలవు తుండడం పోలీసు శాఖకు పెద్ద వెలితిగా మారింది. హత్య కేసులతోపాటు హత్యకు ప్రయత్నించిన కేసుల్లో నిందితులుగా వున్న వారిపై పోలీసులు వెంటనే రౌడీషీట్ తెరుస్తూ వారంతా కొన్ని రోజులపాటు ప్రతిరోజు, మూడు నెలల తరువాత వారా నికి ఒకసారి, చివరగా ఇంకొంత కాలం తరువాత నెలకోసారి పోలీసు స్టేషన్లకు వచ్చి తమ వివరాలు ఇవ్వాల్సి వుంది. అయితే చాలాచోట్ల ఈ ప్రక్రియ సవ్యంగా అమలవడం లేదనే ఆరోపణలున్నాయి. నిందితుల తరపున కొందరు బడా నేతలు పోలీసులకు నజరానాలు ఇస్తూ హత్య కేసుల్లో నిందితులు స్టేషన్ల కు రాకుండా చూస్తున్నారనే ఆరోపణలున్నాయి.
ఇలా హత్యలు, హత్యాయత్నం కేసుల్లో నిందితులుగా వున్న వారు బడా నేతలతో కలిసి పోలీ సులకు ఆమ్యామ్యాలు ఇస్తూ దర్జాగా తిరుగుతూ మళ్లీ మళ్లీ నేరాలు చేస్తున్నారనే అభియోగాలు కూడా వున్నాయి. హత్యలు, హత్యాయత్నం కేసుల్లో నిందితులుగా వున్న వారిపై పోలీసులు కోర్టులకు సమర్పించే ఛార్జిషీట్లు చాలా వరకు సరిగ్గా వుండడం వల్ల నిందితులు సులభంగా తప్పించుకుంటున్నారని హైకోర్టు సీనియర్ న్యాయ వాదులు చెబుతున్నారు.




జంట గ్రేటర్ పరిధిలో రెండు నెలల వ్యవ ధిలో నాలుగు హత్యలు బహిరంగంగా జరిగాయి. జగిత్యాలలో యూట్యూబర్ వైష్ణవి హత్యకు ప్రతీకారంగా ఆమె సోదరుడు సొంత బావను నడిరోడ్డుపై వేట కొడవలితో నరికి చంపాడు. సూర్యాపేట్‌లో 20 ఏళ్ల క్రితం జరిగిన హత్యలో నిందితుడుగా వున్న వ్యక్తి ఇంతకాలం పరారీలో వుండి తమ బంధువు చనిపోవ డంతో రాగా ప్రత్యర్థులు రోడ్డుపై నరికి చంపారు.

**సాక్షులను రక్షించే ప్రత్యేక వ్యవస్థ లేకపోవడం పెద్ద వెలితి**

ఇదిలా ఉండగా హత్యలతోపాటు హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడాలంటే సాక్షులు కోర్టులో సాక్ష్యం చెపా ల్సి వుంటుంది. అనేక దేశాల్లో సాక్షులను కాపాడుకునే వ్యవస్థ వుంది. ఈ వ్యవస్థను విట్‌నెస్ ప్రొటెక్షన్ సిస్టం అని పిలుస్తుంటారు. ఈ వ్యవస్థ పటిష్టంగా వుండేందుకు ఆయా దేశాల్లో ప్రత్యేకంగా విభాగాలు వున్నాయి. అవసర మైతే సాక్షులకు పోలీసు విభాగాలు తాముండే సురక్షిత ప్రాంతాలలోనే వుండే వీలు కల్పించడంతో పాటు ఇదే ప్రాంతంలో ఉద్యోగాలు కూడా ఇస్తారు. ఇక కోర్టుల్లో వీరి సాక్ష్యాల ఆధారంగా నిందితులకు శిక్షలు పడిన తరువాత సాక్షులుగా వున్న వారిని పోలీసులు మరికొంత కాలం సురక్షితంగా కాపాడుతారు. ఈ తరహా వ్యవస్థను ఇండియాలోనూ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ దశాబ్దాలుగా అనుకుంటున్నా ఆచరణలో అ మలు కావడం లేదు.

# షాద్‌నగర్‌లో 13 కిలోల జింక మాంసం పట్టివేత

**షాద్‌నగర్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఎస్‌వోటీ పోలీసులు 13 కిలోల జింక మాంసాన్ని పట్టుకున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ శివారులోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన తనిఖీల్లో 8 మంది నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు వాహనాలతో పాటు ఒక రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్న జింక మాంసం, నిందితులు, వాహనాలు, రైఫిల్‌ను అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ కేసును అటవీ శాఖ ఉన్నతాధికారి స్టీవా ఆశిష్ పర్యవేక్షి స్తున్నారు. ప్రస్తుతం నిందితులను, స్వాధీనం చేసుకున్న మాంసాన్ని షాద్‌నగర్ నియోజక వర్గంలోని కొత్తూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై అటవీ శాఖ అధికారులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భం గా అటవీ శాఖ ఐఎఫ్ఎస్ అధికారి స్టీవా ఆశిష్ పోలీస్ స్టేషన్ కు చేరుకొని పరిస్థితిని సమీక్షి ంచారు.



పోలీసులకు అప్పగిస్తున్న శాంపిల్స్

**అది జింక మాంసమే..**

సీసీఎంబి టెస్ట్ ద్వారా గుర్తించిన కొత్తూరు పశు వైద్య అధికారిని పద్మిని షాద్ నగర్ పరిధిలోని రాయికల్ టోల్గేట్ వద్ద జింక ఎస్ఓటి పోలీసులు తనిఖీల ద్వారా పట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే అది జింకమాంసమేనా, కాదా అన్నదానిపై కొత్తూరు పశువైద్య అధికారిని పద్మిని పరీక్షలు నిర్వహించారు. సీసీఎంబి టెస్ట్ ద్వారా అది జింక మాంసమేనని నిర్ధారించారు. దానికి సంబంధించిన శాంపుల్స్ సేకరించడం ద్వారా సేకరించిన వివరాలను విచారణ అధికారులకు అందజేశారు. ఈ సంఘటనలో ఇప్పటికే పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వారి నుంచి వాహనాలు, రివాల్వర్ కూడా స్వాధీనం చేసుకున్నారు. జింక మాంసం నిర్ధారణ ద్వారా పోలీసులు మరో అడుగు ముందుకు వేశారు.

**ENDOWMENTS DEPARTMENT**
Sri Sivalayam Temple
Vellatur(V), Pendlimarri(M), YSR Kadapa District
e-Procurement Tender
NIT.NO.P/COE/1843/2026, Dt: 10-09-2026
e-Tenders are invited through the e-Procurement portal for Reconstruction of Temple. Interested bidders may visit the official website **www.apeprocurement.gov.in** for detailed information, eligibility criteria, and submission guidelines.
**Trustee**

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
29-9-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 240 పేజీలు: 16 వెల: 6.50

పేదల గుండెకు మరింత ప్రభుత్వ భరోసా 5లో
ధవళేశ్వరం వద్ద ఉధృతంగా గోదావరి

రూ.11,085 కోట్లతో

## పల్లె పండుగ

గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి

నేడు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో శ్రీకారం

సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ రాక

ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

**నెల్లూరు(కలెక్టరేట్), సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** గ్రామాల సర్వతోముఖాభివృద్ధే 'పల్లె పండుగ' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. 29న ఉదయగిరి నియోజకవర్గం వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొననున్న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, టిడిపి అబ్జర్వర్ గురవారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఆర్డీఓ అనూషా తదితరులు పాల్గొన్నారు. మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో అవసరమైన ప్రాథమిక మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయడమే 'పల్లె పండుగ' కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. రోడ్లు, డ్రైన్లు, పశువుల షెడ్లు, వ్యవసాయ కుంటలు, నీటి తొట్టెలు తదితర మౌలిక వసతులను గ్రామాల్లో ఒకేసారి చేపట్టేందుకు పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం >>2

## సబ్‌కలెక్టర్లుగా ఐఎఎస్ ప్రొబేషనర్లు నియామకం

**అమరావతి, సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** 2024 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ఐఏఎస్ ప్రొబేషనర్లు తమ ఫేజ్2 శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ సబ్‌డివిజన్లకు సబ్‌కలెక్టర్లుగా నియమితులయ్యారు. గుంటూరు జిల్లా తెనాలి సబ్‌డివిజన్ సబ్‌కలెక్టర్‌గా సందీప్ రఘువంశీ, అల్లూరి >>2



పంట పండినా పలకని ధర

గిట్టుబాటులేక అలమటిస్తున్న రైతులు

రవాణా ఖర్చులైనా రాక పంటను నేలపాలు చేస్తున్న దుస్థితి

# మార్కెట్ 'ప్లేవర్' లేని కాలీఫ్లవర్

**ప్రభాతవార్త / న్యూస్ నెట్‌వర్క్:** తెలుగు రాష్ట్రాల్లో కాలీఫ్లవర్ రైతులు పడుతున్న కష్టాలు కంటనీరు పెట్టిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కాలిఫ్లవర్ పెద్దఎత్తున దిగుబడి వచ్చింది. తమ కష్టాలకు ప్రతిఫలం వచ్చిందని ఆశపడ్డ రైతులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాకపోవడంతో ఆడియాశలు అయ్యాయి. పంటను మార్కెట్‌కు తరలించేందుకు అయ్యే ఖర్చు కూడా రాకపోవడంతో చేలలోనే పంటను దుక్కిదున్ని మరో విడత సాగుకు సిద్ధపడుతున్నారు. ఏపీ,తెలంగాణలో సుమారు 4,400 ఎకరాల్లో కాలీఫ్లవర్ సాగుచేస్తున్నారు. సుమారు 43 వేల టన్నులకు పైగా దిగుబడి వస్తోంది. ఈ సీజన్‌లో మరింత దిగుబడి పెరిగింది. కేజీకి కనీసం 8 నుంచి పది రూపాయలు ధరపలికితే ఖర్చులు పోను కొంత సొమ్ము మిగులుతుంది. అయితే వ్యాపారులు కేవలం రెండునుంచి మూడు రూపాయలు ఇస్తానని చెప్పడంతో రైతులు చేలలోనే చతికిల పడే దుస్థితి ఏర్పడింది. ఒక ఎకరంలో పంటను పండించాలంటే సుమారు 60నుంచి 80వేల రూపాయలు ఖర్చు అవుతుంది. కూలీలకే 15నుంచి 20వేల రూపాయల వ్యయం >>2



సోమవారం కుంచనపల్లిలో పేదలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న మంత్రి నారా లోకేష్

## హామీలన్నీ అమలు చేస్తా.. పేదలందరికీ ఇళ్లు ఇస్తాం!

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకే ఓట్లేయండి

కుంచనపల్లిలో ఇళ్ల పట్టాల పంపిణీలో మంత్రి లోకేష్

**మంగళగిరి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం, పేద లందరికి ఇళ్లు ఇస్తామని మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి మండలం కుంచనపల్లి శ్రీశ్రీనివాస కన్వెన్షన్స్‌లో 'మన ఇల్లు - మన లోకేష్' కార్యక్రమంలో భాగంగా మంత్రి లోకేష్ చేతుల మీదుగా 372మందికి శాశ్వత పట్టాలు, పిఎంఎవై మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ 'మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రి ఇక్కడ ప్రజల దశాబ్దాల కల. ప్రజా >>2



అలిపిరి వద్ద రూ.500 కోట్లతో

## భారీ టౌన్‌షిప్!

- శ్రీవారి భక్తులకు అక్కడ నుండే సకల సేవలు
- పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యం
- ఎలక్ట్రిక్ వాహనాలకే ఇక నుంచి కొండపైకి అనుమతి
- తిరుమల విజన్ 2047 అమలులో భాగంగానే నిర్ణయం
- టిటిడికి ప్రభుత్వం అనుమతి.. త్వరలో పనులకు శ్రీకారం

**తిరుమల, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల విజన్ 2047 అమలులో భాగంగా తిరుమల క్షేత్రాన్ని పర్యావరణం పరిరక్షణతోబాటు కాలుష్య నియంత్రణలో భాగంగా పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలకు బ్రేకప్ ఇవ్వాలనే ఆలోచనతో టిటిడి అడుగులేస్తోంది. ఇందుకు రవాణాశాఖ, పోలీస్‌శాఖ సహకారం తీసుకుని పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలను తిరుమలకు అనుమతించాలనే చర్చ మొదలైంది. దీనివల్ల తిరుమల ఘాట్‌రోడ్లపై కాలుష్య శాతాన్ని భారీగా తగ్గించవచ్చనేది ఆలోచన. ఇందుకు అలిపిరి వద్ద సుమారు రూ.500 కోట్ల వ్యయంతో అన్ని సౌకర్యాలతో భారీ టౌన్‌షిప్ నిర్మాణంచేసే దిశగా రూపొందించిన ప్రణాళికలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుమతినిచ్చిన విషయం విదితమే. తిరుమలను నో హారన్ జోన్‌గా తీర్చిదిద్దడంతోబాటు శబ్ద కాలుష్యాన్ని 80 శాతం తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సుమారు 150 ఎకరాల్లో నిర్మించే ఈ టౌన్‌షిప్‌లో అలిపిరి వద్దే వసతి, పార్కింగ్, భోజన సౌకర్యాలు, పూజా సామగ్రి వంటి అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. భక్తులకు దర్శనాలను మరింత ప్రశాంతంగా, ఆధ్యాత్మికంగా మార్చేందుకు చూస్తున్నారు. అలిపిరి వద్ద టౌన్‌షిప్ ఏర్పాటైతే అక్కడే భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటుకు నిర్ణయించారు. తిరుపతి అలిపిరిలో బేస్‌క్యాంపు >>2

ఆక్వా వ్యర్థాల అనర్థాలు

## నివారించండి



ప్రాసెసింగ్ యూనిట్లలో పర్యావరణ ప్రమాణాల అమలుకు ప్రత్యేక పర్యవేక్షణ

జల వనరుల పరిరక్షణకు చర్యలు ముమ్మరం

నిర్దేశిత ప్రమాణాలు పాటించని యూనిట్లపై చర్యలు

కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు డి.సిఎం పవన్ ఆదేశం

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆక్వా వ్యర్థాల కారణంగా ఉత్పన్నమయ్యే అనర్థాల నుంచి జలవనరులను పరిరక్షి ంచే విధంగా నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా ప్రాసెసింగ్, ఆక్వా ప్రిప్రాసెసింగ్ యూనిట్లు నిర్దేశిత పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. జల వనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. శుద్ధి చేయని ఆక్వా వ్యర్థాల్లో పరిమితికి మించి హానికారక రసాయనాలు ఉండడం వల్ల నదులు, కాలువలు, సాగర సంగమ ప్రాంతాలతోపాటు భూగర్భ జలాలు కూడా కాలుష్య బారినపడి, అది ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బ తీస్తుందని తెలిపారు. ఆక్వా ప్రాసెసింగ్, ప్రిప్రాసెసింగ్ యూనిట్ల నుంచి వెలువడుతున్న కాలుష్య ప్రభావం, నివారణ చర్యలపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 119 ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, 12 ఆక్వా ప్రిప్రాసెసింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయని, ఉపముఖ్యమంత్రి సూచనల మేరకు ఈ యూనిట్లలో పర్యావరణ ప్రమాణాల అమలును నిర్ధారించేందుకు విస్తృత స్థాయిలో తనిఖీలు, నమూనాల సేకరణ, పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎపిపిసిబి అధికారులు పవన్ కళ్యాణ్‌కి వివరించారు. 82 యూనిట్ల నుంచి నమూనాలు సేకరించగా, కొన్నింటిలో పిహెచ్ లెవల్స్, నీటిపై తేలియాడే ఘన వ్యర్థాలు, బిఒడి వంటి కీలక ప్రమాణాల్లో మార్పులు గుర్తించారు. పర్యావరణ ప్రమాణాలు పాటించని 10 యూనిట్లకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు,వివరణ ఇచ్చేందుకు, దిద్దుబాటు చర్యలకు రెండువారాల గడువు ఇచ్చినట్టు తెలిపారు. నిరంతరాయంగా >>2

## పడిపుట్లబైలులో ఏనుగుల సంచారం: 'కుంకీలను దించండి

అడవిలోకి మళ్లించేందుకు ఏర్పాట్లు చేయండి: అధికారులకు డి.సిఎం పవన్ ఆదేశం 2లో



మచిలీపట్నం, కర్నూలు సిటీ మధ్య

## కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు

ఈ నూతన సర్వీసుకు కేంద్రం ఆమోదం

విజయవాడ, గుడివాడ, నంద్యాల మీదుగా కొనసాగనున్న సర్వీసు

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల మధ్య ప్రయాణించే వారికి భారతీయ రైల్వే శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మచిలీపట్నం, కర్నూలు సిటీ మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును ప్రారంభించేందుకు ఆమోదం తెలిపింది. ఈ రైలు విజయవాడ, గుడివాడ, నంద్యాల మీదుగా ప్రయాణిస్తూ కీలక ప్రాంతాలను కలుపుతుంది. సుమారు 499 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ సర్వీసు, వారానికి మూడు రోజుల చొప్పున రెండు దిశల్లోనూ అందు బాటులో ఉండనుంది. ఈ రైలు మచిలీపట్నం నుంచి కర్నూలుకు సోమ, బుధ, శనివారాల్లో ఈ రైలు నడవనుంది. మచిలీపట్నంలో సాయంత్రం 4:55 గంటలకుబయలుదేరి, రాత్రంతా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 5:45 గంటలకు కర్నూలు సిటీకి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో, కర్నూలు సిటీ నుంచి మంగళ, గురు,ఆదివారాల్లో ఉదయం 9:30 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9:35 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది. ఈ సమయాలు రాత్రి ప్రయాణికులకు, అలాగే పగటిపూట ప్రయాణించాలనుకునే వారికి అనుకూలంగా ఉన్నాయి. ఈ రైలు సర్వీసుకు గుడివాడ, విజయవాడ, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపురం రోడ్, కంభం, గిద్దలూరు, దిగువమెట్ట, నంద్యాల,బేతంచెర్ల, డోన్ స్టేషన్లలో వాణిజ్యపరమైన హాల్టులను కేటాయించారు. ఈరైలుతో కోస్తా జిల్లాల నుంచి పల్నాడు, ప్రకాశం,నంద్యాల,కర్నూలు జిల్లాలకు ప్రత్యక్ష రవాణా సౌకర్యం మెరుగు పడుతుంది. రైలునంబర్, ఛార్జీల వివరాలను రైల్వేశాఖ త్వరలో ప్రకటించనుంది.

బంగాళాఖాతంలో

## మరో వాయుగుండం

కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం




**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో మరో వాయుగుండంఏర్పడింది. ఈ వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది.

మయన్మార్, అండమాన్ దీవుల సమీపంలో ఏర్పడిన ఈ వాయుగుండం, ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కు 580 కిలోమీటర్ల దూరంలో తూర్పుఈశాన్య దిశలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా బంగ్లాదేశ్ వైపు కదులుతోంది. రానున్న 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి, సుమారు 72 గంటల్లో బంగ్లాదేశ్ తీరాన్ని తాకవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ వాయుగుండం ప్రభావంతో ప్రభావిత ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇటీవలే ఉత్తరాంధ్ర తీరంలో కళింగపట్నం వద్ద ఒక తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టం జరిగిన నేపథ్యంలో తాజా హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

ఫ్రీహోల్డ్ భూములపై

## నిషేధాన్ని ఎత్తివేయాలి

సిఎం చంద్రబాబుకు బిజెపి అధ్యక్షుడు మాధవ్ లేఖ

**విజయవాడ,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సెక్షన్ 22ఏ పరిధిలోని అర్హత కలిగిన ప్రైవేట్, ఫ్రీహోల్డ్ భూములపై నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. అర్హత ఉన్న ప్రైవేట్ మరియు ఫ్రీహోల్డ్ భూములను తక్షణమే 22ఏ జాబితా నుంచి తొలగించి, భూ యజమానులకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి లేఖలో కోరారు. ఒకే సర్వే నంబర్‌కు సంబంధించి ఉన్న డూప్లికేట్, పాత లేదా సరైన ఆధారాలు లేని ఎంట్రీలను తొలగించాలని కోరారు భూమిని 22ఏ జాబితాలో ఎందుకు చేర్చారో తెలిపే ప్రభుత్వ ఉత్తర్వులు, >>2




సోమవారం విజయవాడ ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు కందుల దుర్గేష్. సత్యకుమార్ యాదవ్ తదితరులు

బెజవాడ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవానికి

## 'విజయవాడ ఉత్సవ్' ప్రతీక

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్

విజయవాడకు ఘనమైన సాంస్కృతిక ప్రాశస్త్యం ఉందన్న మంత్రి సత్యకుమార్

అక్టోబరు 8 నుంచి 23 వరకు జాతీయ స్థాయి 'సరస్ మేళ్లా: ఎంపి చిన్ని

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** బెజవాడ నగరానికి శతాబ్దాల చరిత్ర అని, కళాసాంస్కృతిక రంగాలకు నిలయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేష్ వ్యాఖ్యానించారు. సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో విజయవాడ ప్రత్యేకత ఏ నగరానికి లేదన్నారు. విజయవాడ ఉత్సవ్ లాంటి ఉత్సవాల వల్ల నగరానికి సరికొత్త ఉత్సాహాన్ని తీసుకురావడంతో పాటు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతాయన్నారు. ఆటో డ్రైవర్లు, చిరువ్యాపారులు తదితర అనేక వర్గాలకు ఉపాధి కల్పిస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని అన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కళా వేదికలో సోమవారం నిర్వహించిన విజయవాడ ఉత్సవాల కర్టెన్ రైజర్ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కళలు, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇలాంటి >>2

29 -9Pg6exHMNWJQE.qxd:29 -9Pg6exHMNWJQE.qxd 1/1/02 6:19 AM Page 1



## మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా



**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** భావ కవిత్వం ఉప్పొంగుతున్న కాలంలోనే సామాజిక స్పృహ ను జోడించి, అణగారిన వర్గాల వేదనలను తన పద్యా లుగా మలచిన అరుదైన ప్రజాకవి గుర్రం జాషువా అని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాష్ట్ర సృజనా త్మక, సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజ యవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా 131వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ము ఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహాకవి గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ వేడుకల్లో భాగంగా తెలుగు సాహిత్య వికాసానికి, మనుగడకు, పరిరక్షణకు విశేష కృషి చేసిన ప్రముఖ సాహితీవేత్తలు షేక్ కరీముల్లా, డాక్టర్ జాలాది విజయకుమారి, విల్సన్ రావు కొమ్మువరపు, గడ్డం ఈశ్వరమ్మలకు కవిసామ్రాట్ గుర్రం జాషువా కవికోకిల సాహితీ పురస్కారం కింద రూ.50వేలు నగదు ప్రోత్సాహకం, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని మంత్రి కందుల దుర్గేష్ అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.."సామాజిక అసమానతలపై తన కలంతో పోరాడి, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి తన సాహిత్యం ద్వారా స్వరం అందించిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువ్వా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సృజనాత్మక, సంస్కృతి సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కీలక పురోగతి

- 1,66,279మంది అనర్హులు
- 44,24,411మంది ఓటర్లకు ఇసి నోటీసులు
- 99.92శాతం విచారణ పూర్తి: అధికారులు

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో సర్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కీలక పురోగతి చోటుచేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జారీ చేసిన 44.28 లక్షల నోటీసుల్లో 44.25 లక్షల నోటీసులకు విచారణ పూర్తైంది. దీంతో మొత్తం 99.92 శాతం నోటీసుల విచారణ పూర్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 3,629 నోటీసులు మాత్రమే విచారణకు మిగిలి ఉన్నాయి. నోటీసులు అందుకున్న 44,24,411 మంది ఓటర్లలో 1,66,279 మందిని అనర్హులుగా తేల్చింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో అవసరమైన వివరాలను నింపకపోవడం, తప్పులు, అసంపూర్ణంగా సమాచారాన్ని అందించడం వంటి కారణాలతో నోటీసులు అందుకున్న 44,24,411 మంది ఓటర్లకు సంబంధించిన విచారణను భారత ఎన్నికల సంఘం పూర్తి చేసింది. తిరుపతి, ఎన్టీఆర్, పల్నాడు, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో మిగిలిన నోటీసుల విచారణ పెండింగ్‌లో ఉంది. తిరుపతి జిల్లాలో 2,477 నోటీసులు విచారణకు మిగిలి ఉండగా.. ఎన్టీఆర్ జిల్లాలో 486, అనంతపురంలో 257, పల్నాడులో 205, ప్రకాశంలో109 నోటీసులు విచారణకు పెండింగ్‌లో ఉన్నాయి. గుంటూరు, నెల్లూరు, నంద్యాల, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో అత్యల్పంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఓటర్ల ఫొటో క్వాలిటీ చెక్‌లో 99.77 శాతం ఆమోదం పొందాయి. రాష్ట్రవ్యాప్తంగా 3.71 కోట్ల మంది ఓటర్ల ఫొటోలను బిఎల్‌ఓలు పరిశీలించగా 3.70 కోట్ల మంది ఓటర్ల ఫొటో క్వాలిటీకి ఆమోదం లభించింది. ఫొటో క్వాలిటీ చెక్‌లో కేవలం 0.23 శాతం పెండింగ్‌లో ఉంది. ఎన్టీఆర్, అనంతపురం, నెల్లూరు, వైఎస్సార్, తిరుపతి జిల్లాల్లో మరింత వేగం పెంచాలని అధికారులు సూచించారు. క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఏపీవ్యాప్తంగా ఫారం6 దరఖాస్తుల్లో 79,779 పెండింగ్‌లో ఉన్నాయి. ఫారం6 పెండింగ్‌లో తిరుపతి, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో అధికంగా కేసులు ఉన్నాయి. తిరుపతిలో 12,913, నెల్లూరులో 9,904, వైఎస్సార్‌లో 9,118, ప్రకాశంలో 7,321, సత్యసాయి జిల్లాలో 5,441 ఫారం6 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే, ఫారం 6తి దరఖాస్తులు 899, ఫారం7 దరఖాస్తులు 9,035, ఫారం8 దరఖాస్తులు 37,890 పెండింగ్‌లో ఉన్నాయి. శీఘ్ర ప్రక్రియలో మిగిలిన పనులపై అధికారులు దృష్టిసారించారు. బీఎల్‌ఓతో కాల్ బుక్ చేసుకునే అభ్యర్థనల్లో మొత్తం పెండెన్సీ 276గా ఉండగా.. వీటిలో 48 గంటలు దాటిన బుక్ ఏ కాల్ కేసులు 84 ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

## భూ రక్షణ కోరుతూ సుప్రీంలో ఆదివాసీలు పిటిషన్

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** భూముల రక్షణ కోసం దాదాపు 2,500 మం ది ఆదివాసీలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తమ పూర్వీకుల భూములను ఆక్రమణలు, బద లాయింపుల నుంచి కాపాడుకోవడానికి ఏపికి చెందిన 2,500 మంది షెడ్యూల్డ్ ప్రాంత గిరి జన రైతులు ఒకే తాటిపైకి వచ్చి సుప్రీంకోరుకు ఫిర్యాదు చేసారని న్యాయవాది అల్లంకి రమేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడు దల చేశారు. గిరిజనులకు ఈ భూములు కేవ లం ఆస్తులు కాదని, వారి సంస్కృతి, సంప్రదా యాల్లో భాగమని పేర్కొన్నారు. అందుకే వీరు తమ హక్కుల సాధన కోసం సుదీర్ఘ న్యాయపో రాటానికి దిగారని వివరించారు. భారత రాజ్యాం గంలోని ఆర్టికల్ 24, 19(5), 5 షెడ్యూల్ ఆధారంగా గిరిజనులకు లభించిన ప్రత్యేక హ క్కులను కాపాడాలని వర్ష రాంబాబు, ఆధార్ సొసైటీ సభ్యులతో కలిసి ఈ పిటిషన్ దాఖలు చేశారు.

## స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఇప్పటికే 15వేల మందికి పదోన్నతులు
- మంత్రి బాల వీరాంజనేయస్వామి



**సచివాలయం,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త :** రాష్ట్రం లోని స్వర్ణగ్రామం,స్వర్ణ వార్డు ఉద్యోగుల ఆచరణ సాధ్యమైన డిమాండ్లన్నింటిని పరిష్కరిచేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సిద్దంగా ఉందని రాష్ట్ర సాంఘీక సంక్షేమం,స్వర్ణగ్రామం,స్వర్ణవార్డుల శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి స్పష్టంచేశారు. సోమవారం సచివాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ లక్షా 23వేల మందిని స్వర్ణగ్రామం,వార్డుల్లో ఉద్యోగులుగా నియామకం చేసి పెద్దఎత్తున ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుని వారి సర్వీసు రూల్స్ గురించి పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించా రు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రత్యేకంగా ఒక మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించి అన్ని అంశాలను చర్చించి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటికే 14వేల మందికి పదోన్నతులు కల్పించగా మున్సిపల్ పరిపాలనా శాఖ కూడా ఇప్పటికే 800మందికి పైగా పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుందని మంత్రి వివరించారు. రికార్డు అసిస్టెంట్ కేడర్లో నియామకమైన ఈ ఉద్యోగులు అందరికీ ప్రభుత్వంపై రూ.150కోట్ల అదనపు భారం పడుతున్నా ఆటోమెటిక్ అడ్వాన్సెమెంట్ స్కీమ్ వర్తింపచేసేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అదే విధంగా సెలవులకు సంబంధించి ఏ ప్రభుత్వ శాఖలోనూ లేని విధంగా ప్రత్యేక పోర్టల్ తీసుకొర్చి 24గంటల్లో సెలవు మంజూరు అయ్యే విధంగా చర్యలు చేపట్టినట్లు స్పష్టంచేశారు. ఈ ఉద్యోగులకు సంబంధించి న్యాయమైన ఆచరణ సాధ్యమైన డిమాండ్లన్నంటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని మంత్రి స్పష్టంచేశారు. సమావేశంలో ఐటి మరియు స్వర్ణ గ్రామం,స్వర్ణవార్డుల శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ 2019-20సంవత్సరాల్లో సుమారు లక్షా 23వేల మందిని నెలకు రూ.15 వేల ఏకీకృత వేతనం తో నియామకం చేయడం జరిగిందన్నారు. ఆ తదుపరి నిర్ధేశిత నిబంధనల ప్రకారం ప్రొబేషన్ ప్రకటంచిన తర్వాత అర్హత గత వారికి రెగ్యులర్ పే స్కేల్ వర్తింపబడిందన్నారు. ఒకే పోస్టులో 6సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసిన వారికి ఈ పథకం వర్తిస్తుందని ఇందుకు సంబంధించి ఈనెల 21న జివో 7ను జారీ చేయడం జరిగిందన్నారు. ఉద్యోగులు పదోన్నతులకు సంబంధించి ఇప్పటికే 18కేడర్లలో 14వేల 331మందికి పదోన్నతులు కల్పించగా మున్సిపల్ పరిపాలన శాఖ కూడా మరో 800 మందికి పదోన్నతులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్,వెల్ఫేర్ అసిస్టెంట్ కేడర్లకు మూడు వారాల్లోగా పదోన్నతి మార్గదర్శకాలు సిద్దం కానుండగా వారికి కూడా పదోన్నతులు కల్పిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో స్వర్ణగ్రామం,స్వర్ణవార్డుల శాఖ సంచాలకులు శివప్రసాద్ పాల్గొన్నారు.

## బిఇడి అధ్యాపకులకు హైకోర్టులో ఊరట

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** బిఇడి కళాశాలల అధ్యాపకులకు హైకోర్టులో ఊరట లభించింది. ఆదికవి నన్నయ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న బిఇడి కళాశాలల్లో ఇప్పటికే నియమితులై, యేళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు నెట్/ ఎపిసెట్ అర్హత లేదనే కారణంతో వారి ధ్రువీకరణను రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించింది. ఈ క్రమంలోనే న్యాయస్థానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించింది. సోమవారం ఈ పిటీషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఇప్పటికే బిఇడి కళాశాలల్లో విధులు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న అధ్యాపకులను నెట్/ఎపిసెట్ అర్హత లేదనే కారణం వల్ల అకస్మాత్తుగా తొలగించడంతో వారి జీవనోపాధిపై ప్రభావం పడుతోందని న్యాయవాది ముతుకుమల్లి శ్రీ విజయ వాదనలు వినిపించారు. ఇప్పటికే అనుబంధ బిఇడి కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకుల అభ్యర్థిత్వాలు/ నియామకాలను ధ్రువీకరించాలని యూనివర్సిటీని హైకోర్టు ఆదేశించింది. సంబంధిత అధ్యాపకులు నెట్/ఎపిసెట్ అర్హత సాధించేందుకు రెండేళ్ల గడువు ఇస్తు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఇప్పటికే సేవలందిస్తున్న బిఇడి అధ్యాపకుల ఉపాధికి రక్షణ కల్పిస్తూ, అదే సమయంలో నెట్/ఎపిసెట్ అర్హత సాధించేందుకు అవకాశం ఇస్తు న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

## విద్యుత్తు రంగంలో సంస్కరణలకు శ్రీకారం

**కైకలూరు, సెప్టెంబరు 28 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలో వ్యవసాయ, ఆక్వా రంగాలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు కూటమి ప్రభుత్వం పలు సంస్కరణలు చేపడుతోందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కైకలూరు మండలం గోపవరం గ్రామంలో రూ.55.00 కోట్లతో నిర్మించిన 220/33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్తు అందించేందుకు ప్రభుత్వం రూ.1,200 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.6.00 వేల కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పెరిగిన విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని పెంచి, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు అందిస్తున్నామని చెప్పారు. పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యుత్తు రంగంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు.

## ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్ అసత్య ప్రచారాలు

- బిజెపి జాతీయ నాయకుడు, ఎపి మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్, కొత్తగా పుట్టుకొచ్చిన మరికొన్ని పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని బిజెపి జాతీయ నాయకుడు, ఎపి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకుడిగా తనను తాను నిరూపించుకోవడంలో ప్రజల ముందు విఫలమయ్యారని, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఓటమి నిరాశతో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, అబద్ధాలతో రాజకీయంగా ఎదగాలని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిక లకు ముందు కూడా స్కామ్‌లు అంటూ రాహుల్ గాంధీ హడావుడి చేశారని, ప్రజలు వారి మాటలు నమ్మకుండా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత తమ మాటలను వెనక్కి తీసుకుని ప్రజలకు, ప్రధాని నరేంద్ర మోదీకి క్షమాపణ చెప్పారని పేర్కొన్నారు.

## పంట నష్టాల ఎన్యుమరేషన్‌ను వేగంగా పూర్తి చేయాలి

- వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టానికి సంబంధించిన ఎన్యుమరేషన్ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తుఫాన్ కారణంగా పంటలకు జరిగిన నష్టంపై అందిన ప్రాథమిక నివేదికలు, ఇప్పటివరకు జరిగిన ఎన్యుమరేషన్ పురోగతిని మంత్రి సమీక్షించారు. తుఫాన్ ప్రభావంతో వివిధ జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వాస్తవ నష్టాన్ని పక్కాగా గుర్తించడం అత్యంత ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. బాధిత రైతుల వివరాల నమోదులో ఎలాంటి లోపాలకు తావులేకుండా, ప్రతి రైతు పంట నష్టాన్ని సమగ్రంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన పంటలకు 1,734 హెక్టార్లలో నష్టం. ఉద్యానవన శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 89 మండలాలు, 351 గ్రామాల్లో ఉద్యానవన పంటలు ప్రభావితమయ్యాయి. మొత్తం 1,734 హెక్టార్ల లో ఉద్యానవన పంటలు దెబ్బతినగా, 5,777 మంది రైతులు పంట నష్టానికి గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటివరకు 445 హెక్టార్లకు సంబంధించి 950 మంది రైతుల పం ట నష్టం ఎన్యుమరేషన్‌ను పూర్తి చేశారు. ఇంకా 1,289 హెక్టార్లకు సంబంధించిన పంట నష్టం వివరాలను నమోదు చేయాల్సి ఉందని అధికా రులు మంత్రికి వివరించారు.

వ్యవసాయ పంటలకు 44,029 హెక్టార్లలో నష్టం..వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం 190 మండలాల్లోని 1,229 గ్రామాలు తుఫాన్ ప్రభావానికి గుర య్యాయి. మొత్తం 71,796 మంది రైతులకు పంట నష్టం జరిగినట్లు గుర్తించగా, సుమారు 44,029 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బ తిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రస్తుత ఎన్యుమరేషన్ పురోగతిని సమీక్షించిన మంత్రి అచ్చెన్నాయుడు, ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.



## తిరుమలలో మంత్రి లోకేశ్

**తిరుమల, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** మంత్రి నారా లోకేష్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు చేరుకున్నారు. సోమవారం రాత్రి ఆయనకు గాయత్రి అతిధిగృహం వద్ద టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్యచౌదరి పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. రాత్రికి ఇక్కడే బసచేయనున్న లోకేశ్ మంగళవారం వేకువజామున శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొంటున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆయన తిరుపతికి తిరుగు ప్రయాణమవుతారు. మంగళవారం ఉదయం తిరుపతిలోని ఓ హోటల్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలు కలసి స్థానిక ఎన్నికల సమావేశంలో పాల్గొననున్నారు. మంత్రి లోకేశ్ రాకతో తిరుపతి, తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలైన భక్తులు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. సోమవారం తిరుచానూరుకు చెందిన రామినేని పూజిత వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించింది. టిటిడి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం డిడిని అందజేశారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం: సిఎండి

**తిరుపతి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఓల్టేజ్‌లో హెచ్చుతగ్గులు, విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పు, వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు తదితర సమస్యలను వినియోగదారులు తమ దృష్టికి తీసుకువచ్చారని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. సోమవారం 'డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి' కార్యక్రమాల ద్వారా వినియోగదారుల నుండి 109 వినతులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఎన్.శోభా వాలెంటీనా, ఆర్.పద్మ, ఎం.మురళీ కుమార్, సిహెచ్ రామచంద్రరావు, ఎస్.రమణ, ఎం.శ్రీకాంత్, ఏ.శ్రీనివాస బాబు, జి.సుధాకర్, ఓఎస్డీ యం.ఉమాపతి, జనరల్ మేనేజర్లు జగదీష్, భాస్కర్ రెడ్డి, లత, సురేష్, పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## శివయ్యకు వెండి బిందెలు బహూకరణ



**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరునికి తిరువూరు వాస్తవ్యులు కృష్ణరా జ్, లలితా కృష్ణరాజ్, సునీత, సిబి విజయమోహన్‌లు వెండి బిందెలు బహూహకరించారు. ఈ మేరకు ఆలయ ఇఒ బికె వెంకటేశులుకు రూ.5,66,29 లు విలువ చేసే వెండి బిందెలను అందించారు. చైర్మన్ కొట్టె సా యిప్రసాద్, బోర్డు సభ్యులు నాగరాజు, డొనేషన్ ఇన్‌చార్జి నాగయ్య తదితరులు పాల్గొన్నారు. దాతలకు ఆలయ నిర్వాహకు లు వేదపండితులతో ప్రత్యేకాశీర్వ చనాలు అందించారు. దుశ్శాలువతో సత్కరించారు.

## బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

- బాలుర విజేత ఇండియన్ రైల్వేస్ బాలికల విజేత తమిళనాడు



**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో నాలు గురోజుల పాటు జరిగిన 72వ జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు సోమవారంతో ముగిసాయి. బాలుర విజేత ఇండియన్ రైల్వేస్ కాగా బాలికల విజేత తమిళనాడు నిలిచింది. విజేతలకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను అందించారు. ఈ పోటీల్లో దేశ నలుమూలల నుంచి 29 రాష్ట్రాలకు చెందిన 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

## నవరాత్రి బ్రహ్మోత్సవాల్లోనూ సామాన్య భక్తులకే ప్రాధాన్యం!



- టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** మరో రెండువారాల్లో కలియుగవైకుంఠం తిరుమలలో ప్రారంభంకానున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్స వాల్లోనూ సామాన్యభక్తులకే ప్రాధాన్యం కల్పిస్తామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్పష్టం చేశారు. సాలకట్ల బ్రహ్మోత్స వాల తరహాలోనే రానున్న నవరాత్రి ఉత్స వాలను రెట్టింపుతో విజయవంతం చేద్దామని ఆయన అధికారులకు సూచించారు. దసరా సెలవులు కూడా రానున్న నేపథ్యంలో భక్తుల సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉంటుందన్నారు. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నవరాత్రి బ్రహ్మోత్స వాల ఏర్పాట్లు, నిర్వహణకు సంబంధించి సోమవారం ఉదయం పద్మావతి అతిధి గృహంలోని సుదర్శ సమావేశం మందిరంలో టిటిడి జెఇఒ ప్రభల గోపీనాథ్, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలిసి సమీక్ష నిర్వహించారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్స వాల తరహాలోనే నవరాత్రి బ్రహ్మోత్స వాలను మరింత విజయవంతం చేద్దామని, గత బ్రహ్మోత్స వాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని రానున్న బ్రహ్మోత్స వాలను మరింత విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అదనపు ఇఒ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు.

## కార్తీక బ్రహ్మోత్సవాలకు విద్యుత్ అలంకరణలు

- టిటిడి జెఇఒ డాక్టర్ శరత్



**తిరుమల,సెప్టెంబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** తిరుచానూరు పద్మావతి అమ్మ కార్తీక బ్రహ్మోత్స వాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తరహాలో ఆకట్టుకునే విద్యుత్ అలంకరణలు చేపట్టా లని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 5 నుండి 14 వ తేదీ వరకు జరుగనున్న అమ్మవారి కార్తీక బ్రహ్మో త్స వాల ఏర్పాట్లను సోమవారం సాయంత్రం ఆయ న అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. గతేడాది కంటే ఈ ఏడాది మరింత కాంతివంతంగా, సుందరంగా విద్యుత్ అలంకరణలు చేపట్టాలని సూచించారు. బ్రహ్మోత్స వాలను దృష్టిలో ఉంచుకుని జరుగుతున్న అభివృద్ధి పనులను జెఇఒ పరిశీలించి, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ హరీంద్రనాథ్, విఎస్ఒ గిరిధర,ఎవిఎస్ఒ శ్రీహరి రావు, ఉఇ రవిశంకర్ రెడ్డి, అదనపు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కుమార్, ఆలయ అర్చకులు బాబు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గణనాధునికి 'మహానందీశ్వరుని' పట్టువస్త్రాలు సమర్పణ

**కాణిపాకం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా సోమవారం మహానంది శ్రీమహానందీశ్వర స్వామి దేవస్థానం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. ప్రతి ఏటా కాణిపాకం దేవస్థానంలో బ్రహ్మోత్స వాల సందర్భంగా శ్రీమహానందీశ్వర స్వామి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు సోమవారం శ్రీమహానంది దేవస్థానం చైర్మన్ చంద్రమౌళిరెడ్డి, ఈఓ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి,ఆలయ అధికారులు కాణిపాకం ఆలయం చైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోంలతో కలసి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం పట్టువస్త్రాల ను స్వామి, అమ్మవార్లకు అలంకరించి ప్రత్యేకపూజ లు నిర్వహించారు. అలాగే మహానంది దేవస్థానం చైర్మన్,ఈఓలు కాణిపాకం ఆలయ అధికారులను సత్కరించి స్వామివారి చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు,ధనపాల్, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలతో పాటు,అర్చకులు,వేద పండితులు పాల్గొన్నారు.

## నాస్తికత్వానికి గోరా-సరస్వతి గోరా జీవితం చిరునామా

**విజయవాడ, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** నాస్తికత్వం అంటే కేవలం దేవుడిని నిరాకరించడం కాదని, సమానత్వం, మానవత్వం, వ్యక్తి గౌరవాన్ని జీవన విధానంగా ఆచరించడమేనని, ఆ సిద్ధాంతాలకు గోరా-సరస్వతి గోరా జీవితమే చిరునామాగా నిలిచిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధురాలు, ప్రముఖ సామాజిక సంస్కర్త, మానవతావాది సరస్వతి గోరా 114వ జయంతి సందర్భంగా సోమవారం విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని నాస్తిక కేంద్రం ఏసీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా జి. సమరం మాట్లాడుతూ సరస్వతి గోరా జీవితం నేటి సమాజానికి ఎంతో ప్రాసంగికమని అన్నారు. కులం, మతం, లింగం, ఆర్థిక స్థితి ఆధారంగా సమాజంలో ఏర్పడుతున్న వివక్షను అధిగమించేందుకు ఆమె చూపిన మార్గం నేటికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. సామాజిక సంస్కరణ కేవలం ప్రసంగాలతో సాధ్యం కాదని, వ్యక్తిగత ప్రవర్తన, కుటుంబ జీవితం, సామాజిక సంబంధాలు, ప్రజా ఉద్యమాల్లో మార్పును ఆచరించడం ద్వారానే సాధ్యమవుతుందని సరస్వతి గోరా జీవితం నిరూపించిందన్నారు. క్విట్ ఇండి యా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవిం చారని, మహిళా సత్యాగ్రహుల బృందానికి నాయకత్వం వహించినందుకు వెల్లూరు సెంట్రల్ జైలులో ఆరు నెలలు నిర్బంధించబడ్డారని చెప్పా రు. స్వాతంత్రం అనంతరం కూడా పేదలు, అణగారిన వర్గాల సమస్యలపై అనేక సత్యాగ్రహాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. వివిధ కులాలు, సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు కలిసి భోజనం చేసే సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాలు, ప్రోత్సహించడం అప్పటి సంప్రదాయ సమాజంలో ఎంతో ధైర్యంతో కూడుకున్న చర్యలని అన్నారు. డి.లక్ష్మి పద్మజ మాట్లాడుతూ మహిళల స్వేచ్ఛ, గౌరవం,సమాన హక్కుల కోసం సరస్వతి గోరా విశేషంగా కృషి చేశారని చెప్పారు. దేవదాసీ వ్యవస్థకు వ్యతి రేకంగా పోరాడటంతో పాటు దేవ దాసీల వివాహ లు, వితంతువు నర్వివాహాలను ప్రోత్సహించారని తెలిపారు. వివాహాల చట్టబద్ధ నమోదు అవసరాన్ని కూడా ఆమె ప్రచారం చేశారని, వ్యవస్థలో భాగస్వామ్యం, ఆర్థిక స్వావలం బన కల్పించేందుకు నాస్తిక కేంద్రం ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టారని వివరించారు.

## 1వ తేదీన పింఛన్ల పంపిణ

- మంత్రి ఉండవల్లి అరుణ్ కుమార్

**అమరావతి, సెప్టెంబర్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. గతంలో ప్రకటించినట్టుగా సవరించిన వేళలతో సంబంధం లేకుండా, ఎప్పటిలాగే అక్టోబర్ 1వ తేదీ ఉదయం 6:30 గంటల నుంచే లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చే సింది. బ్యాంకు ఉద్యోగులు తమ సమ్మెను విర మించడంతో బ్యాంకింగ్ కార్యకలాపాలకు ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ముందస్తు ప్ర ణాళిక ప్రకారమే పింఛన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడిం చారు. సెప్టెంబర్ 30వ తేదీనే స్వర్ణ గ్రామం / స్వర్ణ వార్డు సిబ్బంది బ్యాంకుల నుంచి 100 పింఛను నగదును విత్‌డ్రా చేసుకుని.. అక్టోబర్ 1వ తేదీ ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల నగదు అందజేస్తారని తెలిపారు. అక్టోబర్ నెలకు గాను ప్రభుత్వం ఇప్పటికే రూ.2,69 2.34 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇందులో రూ.2,692.28 కోట్లను పంచాయతీ / వార్డుల ఖాతాలకు జమ చేయగా, రూ. 6 లక్షలను గజపతినగరం మండలంలోని ఎన్ఎస్‌ఎపీ పింఛనుదారుల ఖాతాలకు డీబీటీ ద్వారా జమ చేస్తారని మంత్రి పేర్కొన్నారు. ఈ నెల 30 నాటికి అవసరమైన నగదు సిద్ధంగా ఉండేలా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు , ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఎస్ఎల్‌బిసి మరియు బ్యాంకర్ల తో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశిం చారు. రాష్ట్రంలోని 61.80 లక్షల మంది పింఛనుదారులకు ప్రతి నెలా 1వ తేదీనే సకాలంలో పింఛన్లు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు.

## అంధుల క్రికెట్‌కు అండగా నిలుస్తాం

- మంత్రి నారా లోకేష్

**అమరావతి,సెప్టెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలు స్తుందని, క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహ కారాలు అందిస్తుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. భారత అంధుల క్రికెట్ జట్టుకు మూడు ప్రపంచకప్‌లు అందించిన మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి సోమవారం మంత్రి లోకేశ్‌తో సమా వేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అంధుల క్రికెట్ ఎదు ర్కొంటున్న సవాళ్లు, క్రీడాభివృద్ధికి చేపట్టాల్సి న చర్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. అజయ్ కుమార్ రెడ్డిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. "ఆంధ్రప్ర దేశ్‌లో అంధుల క్రికెట్‌ను మరింత బలోపేతం చేయడం, రాష్ట్ర, దేశ స్థాయిల్లో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు మద్దతుగా నిలవడం, ప్రత్యేకించి దృష్టి లోపం ఉన్న క్రికెటర్ల కోసం ప్రత్యేక క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటి కీలక అంశాలపై చర్చించాం" అని లోకేశ్ తెలిపారు. అంధ క్రీడాకారుల ప్రతిభ, అకుంఠిత దీక్ష, వారు సాధించిన విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. "వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాల్సి న బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. అజయ్ రెడ్డి వంటి క్రీడా కారులతో నేరుగా చర్చించి, ప్రభుత్వపరంగా పూర్తి మద్దతు ప్రకటించడం పట్ల అంధ క్రీడా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# పేదల గుండెకు మరింత ప్రభుత్వ భరోసా

**• మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి • త్వరలో కాకినాడలో క్యాథ్ ల్యాబ్ సేవలు • తిరుపతి, నెల్లూరు, శ్రీకాకుళంలో కొత్త క్యాథ్‌ల్యాబ్‌లు • గుండె వైద్య పరికరాల కోసం రూ.34 కోట్ల వ్యయం • అనంతపురంలో త్వరలో ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలు • గుంటూరు, విశాఖ, కర్నూలులో విస్తృత సేవలు**

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో గుండె సంబంధిత వైద్య సేవలను మరింత విస్తరించి, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుండె జబ్బులకు వైద్యం కోసం పేదలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అవసరమైన వైద్య సేవలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. గుండె వైద్య నిపుణుల అందుబాటును పెంచేందుకు వైద్య పిజి కోర్సుల్లో కొత్తగా 16 సీట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. ప్రతి ఏటా సెప్టెంబరు 29న ప్రపంచ హృదయ దినోత్సవ్న నిర్వహిస్తారు. 2026లో ప్రపంచ హృదయ సమాఖ్య "డోంట్ మిస్ ఎ బీట్" అనే నినాదంతో అవగాహన కల్పిస్తోంది. గుండె జబ్బుల సంకేతాలను గుర్తించడం, గుండెను కాపాడుకోవడం, గుండె ఆరోగ్యంపై చర్యలు తీసుకోవాలని కోరడం ఈ ప్రచారంలోని ప్రధాన సందేశాలు. ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 2 కోట్ల మంది (20 మిలియన్లు) గుండె జబ్బులతో మరణిస్తున్నారు. భారత్‌లో ప్రతి నాలుగు మరణాల్లో ఒకదానికంటే ఎక్కువ మరణాలకు గుండె జబ్బులే కారణమవుతున్నాయి. ఛాతినొప్పిని గ్యాస్‌గా భావించడం, ఆయాసాన్ని వయసు ప్రభావంగా తీసుకోవడం, చెమటలు, నీరసాన్ని నిరక్ష ్యం చేయడం వల్ల ప్రమాద సంకేతాలు గుర్తించకుండా పోతున్నాయి.



**త్వరలో కాకినాడలో క్యాథ్‌ల్యాబ్:** కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం తో ఏర్పాటు చేసిన ఆధునిక క్యాథ్‌ల్యాబ్ పనులు పూర్తయ్యాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఒప్పందం కూడా పూర్తయిందని, అక్టోబర్ 1న క్యాథ్‌ల్యాబ్ సేవలు ప్రారంభించనున్నామని చెప్పారు. తిరుపతి, నెల్లూరు, శ్రీకాకుళం ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో కొత్త క్యాథ్‌ల్యాబ్‌ల ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. వీటి కోసం రూ.18 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు.

ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో 8 క్యాథ్‌ల్యాబ్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. వీటిలో 5 ప్రభుత్వ ఆధ్వర్యంలో, 3 ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో పనిచేస్తున్నాయని మంత్రి వివరించారు.

**హార్ట్-లంగ్ మెషిన్లకు రూ.10 కోట్లు:** తిరుపతి, కడప, అనంతపురం, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రులకు మరో 4 హార్ట్-లంగ్ మెషిన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రూ.10 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే కర్నూలు, గుంటూరు, విజయవాడలో హార్ట్-లంగ్ మెషిన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విశాఖ కెజిహెచ్‌లో సామాజిక బాధ్యత నిధులతో హార్ట్-లంగ్ మెషిన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. కర్నూలు, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యాధునిక 2డి ఎకో మెషిన్ల కోసం రూ.2 కోట్లు ఖర్చు చేయనున్నామని మంత్రి తెలిపారు. గుండె వైద్యానికి అవసరమైన ఐసియు మానిటర్లు, డీఫిబ్రిలేటర్లు, శస్త్రచికిత్సకు అవసరమైన ఇతర పరికరాల కోసం మరో రూ.4 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. మొత్తంగా రాష్ట్రంలోని ముఖ్య ప్రభుత్వ ఆసుపత్రుల్లో గుండె వైద్య పరికరాలు, మౌలిక వసతులను పెంచేందుకు రూ.34 కోట్ల ప్రణాళిక అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

రాయలసీమ ప్రజలు గుండె శస్త్రచికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అనంతపురంలో త్వరలో ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలు ప్రారంభించనున్నామని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన హార్ట్-లంగ్ మెషిన్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. కాకినాడలో ఓ కార్పొరేట్ సంస్థ ద్వారా 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో హార్ట్ సెంటర్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు.

## ధవళేశ్వరం వద్ద ఉధృతంగా గోదావరి

**• 11.6 అడుగులకు చేరిన నీటిమట్టం**

**• 9.64 లక్షల క్యూసెక్కులు విడుదల**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.6 అడుగులకు చేరడంతో అధికారులు 175 గేట్లను ఎత్తి 9.64 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భారీ ప్రవాహం నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తత కొనసాగుతోంది.

**ప్రజలకు అప్రమత్త హెచ్చరిక:** గోదావరి ప్రవాహం ఉధృతంగా ఉన్నందున నదిలోకి దిగడం, ఈతకు వెళ్లడం, చేపల వేటకు వెళ్లడం, రేవులు- లోతట్టు ప్రాంతాల వైపు వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలకు ప్రజలు దూరంగా ఉండాలి. ముఖ్యంగా నదీ తీర గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అధికారుల హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. వరద పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

## గుర్రం జాషువా, భగత్‌సింగ్‌లకు సిఎం నివాళి

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** కవికోకిల గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి సందర్భంగా సిఎం చంద్రబాబు నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో నవచైతన్యాన్ని నింపిన విప్లవవీరుడు భగత్‌సింగ్ అని సిఎం కొనియాడారు. కలంతో సమాజంలో సమానత్వపు వెలుగులు నింపిన కవి గుర్రం జాషువా అని ముఖ్యమంత్రి కీర్తించారు. ఈ మేరకు 'ఎక్స్' ఖాతాల్లో సిఎం పోస్టులు పెట్టారు. భగత్‌సింగ్ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని డి.సిఎం పవన్ కల్యాణ్ 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. యువతలో నూతన ఉత్తేజాన్ని నింపిన త్యాగనిరతి అయనదన్నారు. విశ్వనరుడు గుర్రం జాషువా సాహిత్యం అజరామరం అన్నారు. ఆయన గబ్బిలం లోతైన ఆలోచనను కలిగిస్తుందన్నారు. మంత్రి లోకేష్ కూడా 'ఎక్స్' వేదికగా భగత్‌సింగ్, గుర్రం జాషువాలకు నివాళి అర్పించారు.

## కుమారుడికి విషమిచ్చి తండ్రి ఆత్మహత్య

**• చిత్తూరు జిల్లా యాదమరిలో విషాదఘటన**

**యాదమరి (చిత్తూరు జిల్లా), సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** కుమారుడికి విషమిచ్చి ఆపై తండ్రి గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన యాదమరి మండలంలో సంచలనం కల్గించింది. చిత్తూరు జిల్లా యాదమరి మండలం భూమిరెడ్డిపల్లి పంచాయతీ కొత్తవెంకటాపురం గ్రామంలో ఏడేళ్ళ కుమారుడు లోహిత్‌కు విషం ఇచ్చి తండ్రి బాబు(37) ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో తండ్రి కుమారుడు ఇద్దరు మృతి చెందడంతో భూమిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాలిలా వున్నాయి. వెంకటటాపురం గ్రామంకు చెందిన వసంతమ్మకు ఐదు మంది సంతానం. వీరందరికీ వివాహాలు జరుగటంతో ఇతర ప్రాంతాల్లో నివాసాలు వుంటున్నారు. వసంతమ్మ చిన్న కుమారుడు చిట్టిబాబు వెంకటాపురం గ్రామంలో నివాసం వుండగా, పెద్ద కుమారుడు వాసు చిత్తూరులో పని చేసుకుంటూ అక్కడే నివాసం వుంటున్నాడు. అలాగే రెండవ కుమారు బాబు అమర్‌రాజ ఫ్యాక్టరీలో పనిచేస్తూ కుమారుడి లోహిత్‌తో పాటు చిత్తూరులో నివాసం వుంటున్నాడు. రెండేళ్ళ క్రితం బాబు కుమార్తె నీళ్ళ సంప్‌లో పడి మృతి చెందడంతో అప్పటి నుండి బాబు తీవ్ర మనస్థాపంలో వుంటున్నాడు. ఈ క్రమంలో బాబు కుమారుడు లోహిత్‌తో కలిసి ఆదివారం చిత్తూరు నుండి వెంకటాపురం గ్రామంకు వచ్చాడు. మిద్దెపైకి కుమారుడు లోహిత్‌తో కలిసి వెళ్ళిన బాబు ఆపై కిందికి దిగలేదు. ఎంత సేపటికి తండ్రి కుమారులు ఇద్దరు మిద్దె మీద నుండి కిందికి దిగకపోవడంతో తల్లి వసంతమ్మ వారిని భోజనం కోసం పిలవడానికి మిద్దె పైకి వెళ్ళింది. అయితే తలుపులు మూసి వుండటం, ఎంత పిలిచినా ఎవ్వరు పలకకపో వడంతో ఆమెకు అనుమానం వచ్చి ఇరుగు పొరుగు వారిని పిలిచింది. వారు వచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్ళి చూడగా తండ్రి బాబు ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెంది వుండగా, కుమారుడు లోహిత్ కింద మృతి చెంది పడి వున్నాడు. కుమారుడు లోహిత్‌కు విషం ఇచ్చి అతను మృతి చెందిన అనంతరం తండ్రి బాబు జీవితంపై విరక్తి చెంది ఫ్యానుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు తల్లి వసంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలం చేరుకున్న ఎస్ఐ ఈశ్వర్‌యాదవ్ తండ్రి బాబు, అతని కుమారుడు లోహిత్‌ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్.. అప్పుల ఊబిలోకి

**భార్య మంగళ సూత్రం అమ్మినా తీరని అప్పులు**

**చివరికి ఉరి పోసుకుని తనువు చాలించి భార్యాభర్తలు**

**నంద్యాల జిల్లా సాంబవరంలో విషాద ఘటన**

**నంద్యాల, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాజంలో ఆన్‌లైన్ మోసాలు నానాటికి మితిరిపోతున్నాయి. వాటికి అలవాటు పడ్డ మనుషులు మితిరమీరిన అప్పులు చేసుకుని కన్నవారికి, అటు భార్యపిల్లలకు, చేసిన అప్పులు చెప్పలేక, ఒక వేళ చెప్పినా వారు తీర్చలేక చాలామంది తనువు చాలిస్తున్నారు. అలాంటి సంఘటన నంద్యాల జిల్లా గోస్పాడు మండలం సాంబవరం గ్రామంలో చోటుచేసుకుంది. డబ్బులను ఎలాగైన సులువుగా సంపాదించాలనే మాయలో పడిన శేషాద్రి దుర్వ్యసనాలకు అలవాటుపడ్డారు. వాటి కోసం కూలీనాలీ చేసుకున్న డబ్బులు చాలక అప్పులు చేయడము ప్రారంభించాడు. చివరకు చేసిన అప్పులు తీర్చాలని డబ్బులు ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో భార్య బంగారు నగలతో పాటు చివరికి మంగళ సూత్రము అమ్మినా కూడా అప్పులు ఊబిలో నుండి బయట పడలేదు. దీనితో ఇద్దరు కలిసి చీరతో ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుని తనువు చాలించారు. భార్యాభర్తలు ఆత్మహత్య ఘటన గ్రామంలో ఒక్కసారిగా విషాదం అలముకుంది. విషయం తెలిసిన వెంటనే గోస్పాడు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శవాలను నంద్యాల ప్రభుత్వం అసుపత్రికి తరలించారు.

## వాయుగుండంతో దెబ్బతిన్న రోడ్లు పునరుద్ధరిస్తాం

**• మరమ్మతులకు రూ.1,498.30 కోట్లతో ప్రతిపాదనలు: మంత్రి బిసి జనార్దన్ రెడ్డి**



**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** తీవ్ర వాయుగుండం వల్ల రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న రహదారులన్నింటినీ త్వరలోనే పునరుద్ధరి స్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ముందస్తు, సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. విపత్తు సమయంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులతో అనునిత్యం సమీక్షలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని నిరంతరం అప్రమత్తం చేశామని మంత్రి పేర్కొన్నారు.

వాయుగుండం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2,405 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని మంత్రి తెలిపారు. ఇందులో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలోనే 412 కిలోమీటర్ల రహదారులు పాడయ్యా యన్నారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 36 చోట్ల రహదారులు కోతకు గురికాగా, 9 చోట్ల రోడ్లకు గండ్లు పడ్డాయని, ఈ ప్రాంతాలలో రవాణాకు ఆటంకం కలగకుండా తక్షణమే తాత్కాలిక పునరుద్ధరణ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. 187 చోట్ల సిడి వర్క్స దెబ్బతినగా, ఇప్పటికే 169 చోట్ల పునరుద్ధరణ పనులు చేపట్టామని, అలాగే, 254 ప్రాంతా లలో రహదారులకు అడ్డంగా పడిపోయిన చెట్లను పూర్తిగా తొలగించి ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చేయగలిగామన్నారు. వర్షాల కారణంగా 103 చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి రద్దీని క్లియర్ చేశారన్నారు.

**రోడ్ల పునరుద్ధరణకు రూ.1,498.30 కోట్లతో ప్రాథమిక అంచనా:** వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక పునరుద్ధరణ పనులకు దాదాపు రూ.162.09 కోట్లు, శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించడానికి రూ.1,336.83 కోట్లు అవసరమవుతాయని ఆర్ అండ్ బి శాఖ అంచనా వేసింది. మొత్తంగా వాయుగుండం నష్టాల నుండి రహదారులను పునరుద్ధరించడానికి రూ.1,498.30 కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా నివేదికను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. ఈ విపత్కర పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసి, సత్వరం స్పందించిన ఆర్ అండ్ బి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని మంత్రి బిసి జనార్దన్ రెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

## నెల్లూరులో మంత్రి నారాయణ మాస్ పిక్చర్

**• రోడ్డు పక్కనే టీ, టిఫిన్ • టెంకాయ్ బండి దగ్గర ముచ్చట్లు • కార్ దిగారు.. కలసిపోయారు**



**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** ఆడంబరం లేదు.. ఆర్భాటం లేదు.. సామాన్యుడిలా పేదల గుండెల్లోకి మంత్రి నారాయణ.. టీకొట్టు వద్ద కబుర్లు.. పేదలతో కలసి టిఫిన్.. నెల్లూరులో పీక్స్ చేరిన నారాయణ మార్క్ అభిమానం.. ప్రజల కష్టాలెరిగిన నేత.. 53, 54 డివిజన్లలో మంత్రి నారాయణ పర్యటన సూపర్ గ్రాండ్ సక్సెస్.. అధికార హోదాను, ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మంత్రి నారాయణ నెల్లూరు నగరంలోని 53, 54వ డివిజన్లలో జరిపిన పర్యటన ఘనంగా సాగింది. నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకుడిగా తన మార్కును మరోసారి చాటుకున్న మంత్రి, కార్ దిగి నేరుగా వీధుల్లోకి వచ్చి సామాన్య ప్రజల్లో ఒకడిగా కలిసిపోయారు. ఒక చిన్న టీ కొట్టు వద్ద ఆగి స్థానికులతో కరచాలనం చేస్తూ, సరదాగా ముచ్చటిస్తూ టీ తాగిన తీరు స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంది. అక్కడితో ఆగకుండా, నగర వీధుల్లో కాలినడకన తిరుగుతూ ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒక సాధారణ టిఫిన్ సెంటర్‌కు వెళ్లి, పేద ప్రజల పక్కనే కూర్చుని ఎంతో ఆప్యాయంగా అల్పాహారం చేశారు. 53వ డివిజన్‌లో టెంకాయలు అమ్ముకునే ఒక మహిళ వద్ద బండి ఆపి, వ్యాపారం ఎలా జరుగుతుందమ్మా? కుటుంబం సౌఖ్యమేనా? అని ఆత్మీయంగా పలకరించి, ఆమె కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఏ చిన్న ఆర్భాటం లేకుండా, ఒక కన్నతండ్రిలా, ఇంటి పెద్దలా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను ఆలకించిన మంత్రి నారాయణ ఉదారతపై నెల్లూరు ప్రజలు తీవ్రంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు మన మంత్రి నారాయణ అంటూ స్థానికులు జేజేలు పలుకుతున్నారు.

## మంగళగిరిలో వైసిపికి భారీ షాక్

**అమరావతి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసిపికి చెందిన పలువురు నేతలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో వారంతా టిడిపిలో చేరారు. మంగళగిరి పట్టణ వైసిపి మాజీ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లోకేశ్ వారికి పసుపు కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఉండవల్లికి చెందిన మాజీ ఎంపిటిసి కళ్లం సంజీవ్ రెడ్డి, తాడేపల్లికి చెందిన వైసిపి సీనియర్ నేత జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నిడమర్రుకు చెందిన వైసిపి నేత కట్టెపోగు బాబురావు టిడిపిలో చేరారు. గుంటూరు బ్రాహ్మణ సంఘం కార్యదర్శి వేమవరపు నారాయణ కూడా టిడిపి కండువా కప్పుకున్నారు. మంగళగిరి, తాడేపల్లి, ఉండవల్లి ప్రాంతాల నుంచి పలువురు నేతలతో పాటు పలు కుటుంబాలు టిడిపిలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. మంగళగిరి అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. మంగళగిరిని దేశంలోనే నంబర్-1 నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగు తున్నాయని తెలిపారు. రాబోయే రెండేళ్లలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, గ్యాస్ సంబంధిత పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

ఆసుపత్రుల నుంచి స్మశానవాటికల వరకు అవసరమైన అభివృద్ధి పనులు కొనసాగుతు న్నాయని చెప్పారు. మంగళగిరి ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగళగిరి నియో జకవర్గ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు.

## ఇహెచ్‌ఎస్ నిధులకు ఉత్తర్వులు

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇహెచ్‌ఎస్‌లో ఉద్యోగులు, పింఛనుదారుల వాటాపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వ వాటాతో పాటు నెలవారీ చందా మొత్తాన్ని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఖాతాకు జమ చేయనున్నారు. నిధుల లభ్యత, ఇహెచ్‌ఎస్ క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికి ఆర్థిక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. దీని వలన ఉద్యోగులకు, పెన్షర్లుకు వైద్యసర్వీసుల పరిధి విస్తరించబడు తుంది. ఈ ఉత్తర్వుల పట్ల ఉద్యోగుల సంఘం నేత కె.విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేసారు.

## స్థానిక సంస్థల పోలింగ్ బూత్‌లు

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం విజయవాడ, విశాఖ సహా 12 నగరపాలక సంస్థల్లో పోలింగ్ బూత్‌ల ఖరారు పూర్తయింది. వీటితో పాటు మరో 29 పురపాలికల్లోనూ బూత్‌ల ఎంపిక ప్రక్రియ ముగిసింది. ఈ మేరకు నగరపాలికలు, పురపాలికల్లో బూత్‌ల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) అధికారికంగా విడుదల చేసింది.

## కాల్వలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల నిర్వహణకు రూ.160 కోట్లు విడుదల: మంత్రి నిమ్మల

**సచివాలయం, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** కాల్వలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులకు సంబంధించి రూ.160 కోట్ల బిల్లులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు జల వనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్ళ పాలనలో నిర్లక్ష్యానికి గురై, దెబ్బతిన్న సాగునీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత తిరిగి గాడిలో పెడుతోందని మంత్రి తెలిపారు. రైతులు భాగస్వామ్యంతోనే సాగునీటి నిర్వహణ మరింత సమర్థవంతంగా జరుగుతుందనే ముఖ్యమంత్రి ఆలోచనకు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

## మంచినీటి కుళాయిలో కప్ప పిల్లలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో మంచినీటి కుళాయి ద్వారా కప్ప పిల్లలు బయటకు రావడం స్థానికంగా కలకలం రేపింది. మంచినీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా లోపం ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీటి పైపులైన్లు, కుళాయిలు, సరఫరా వ్యవస్థను తనిఖీ చేయడంతో పాటు నీటి నాణ్యతను పరీక్షి ంచాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు సురక్షి తమైన తాగునీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు గుర్తింపు

**• ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

**విజయవాడ, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ఎంప్యానెల్‌మెంట్ విధానంపై సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర కార్యక్రమాలను వీరు విస్తృతంగా ప్రచారం చేస్తారు. ఇలా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వారిని గుర్తించి, ధ్రువీకరణ ఇచ్చేందుకు ఈ ఎంప్యానెల్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు గుర్తింపును ఇచ్చేందుకు ఇటీవల సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. తాజాగా ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**వైఎస్ వివేకా హత్య కేసు**

## ఎర్ర గంగిరెడ్డిపై ప్రశ్నల వర్షం

**• తొమ్మిది గంటల పాటు విచారణ**

**• నేడూ విచారణకు రావాలని ఆదేశం**

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** వైఎస్ వివేకా హత్య కేసులో ఎ1 ఎర్ర గంగిరెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) అధికారులు సోమవారం సుదీర్ఘంగా తొమ్మిది గంటల పాటు విచారించారు. ఈ కేసులో ఎ2గా వున్న సునీల్ యాదవ్‌ను ఈడీ అధికారులు శుక్ర, శనివారాల్లో వరుసగా రెండు రోజుల పాటు విచారించడం తె లిసిందే. అంతకు ముందు ఇదే కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని కూడా విచారించడం విదితమే. అయితే సునీల్ యాదవ్ విచారణ ముగిసిన రెండు రోజులకే ఎర్ర గంగిరెడ్డి విచారణ సాగడం గమనార్హం. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లోని ఇడి కార్యాయంలో ఎర్ర గంగిరెడ్డిని ఇడి అధికారులు తొమ్మిది గంటల పాటు అనేక అంశాలపై ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో నిందితులు ఎవరు? రూ.40 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు సమకూర్చారు? ఎందుకు ఇచ్చారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఫోన్ కాల్స్, డిజిటల్ ఆధారాలపై దృష్టి సారించిన ఇడి అధికారులు సునీల్ యాదవ్‌ను ప్రశ్నించినట్లుగానే ఎర్ర గంగిరెడ్డిని విచారించినట్లు సమాచారం. ఎ3 ఉమాశంకర్ రెడ్డిలతో జరిపిన ఫోన్ సంభాషణలపై ఎర్ర గంగిరెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది. కాల్ డేటా రికార్డును అతని ముందు వుంచి వివరాలను రాబట్టినట్లు సమాచారం. ఎర్ర గంగిరెడ్డి బ్యాంకు లావాదేవీలను 2019 నుంచి ఇడి అధికారులు పరిశీలించి అనుమానిత వ్యవహారాలపై అతన్ని ప్రశ్నించినట్లు తెలిసింది. దస్తగిరికి కోటి రూపాయలు ఇచ్చిన విషయం గురించి ఇడి అధికారులు గంగిరెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది. ఎర్ర గంగిరెడ్డిని మంగళవారం మరోదఫా విచారణకు రావాలని ఇడి అధికారులు ఆదేశించారు.

## అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**• ముగ్గురు నిందితులు అరెస్టు.. 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**



పోలీసులకు పట్టుబడ్డ అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా

**బంగారుపాళ్యం(చిత్తూరు జిల్లా), సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను సోమవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను బంగారుపాళ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు చెడు అలవాట్లకు బానిసై దొంగతనాలకు పాల్పడ్డారు. వీరి ముగ్గురిపై తమిళనాడులో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై వున్నాయి. కాటప్పగారిపల్లి, నలగాంపల్లి గ్రామ సమీపాల్లో నలగాంపల్లి గ్రామంకు చెందిన శివకుమార్ ద్విచక్రవాహనం ఈ ముఠా చోరీ చేసింది.

శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా సోమవారం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు ముగ్గురు అనుమానితులు ద్విచక్ర వాహనాలపై వస్తూ పట్టుబడ్డారు.

వీరిని విచారించగా వేలూరు జిల్లా ఆంబూరు తాలుకాకు చెందిన వడపూర్‌పట్టు గ్రామానికి చెందిన విఘ్నేష్‌కుమార్(20), ఎంవి కుప్పం గ్రామంకు చెందిన చంద్రభీమన్(24), ఎస్ఆర్‌కుప్పంకు చెందిన విజయ్(26)లు ద్విచక్రవాహనాలను దొంగలించినట్లు గుర్తించారు. వారి నుండి నాలుగు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని జిల్లా కోర్టుకు నిందితులను రిమాండ్ నిమిత్తం తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు చెప్పారు.

## సినీ నటి రకుల్‌ప్రీత్ ఇంట్లో ఐటి సోదాలు



**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** బాలీవుడ్ ప్రముఖులకు ముంబై ఆదాయపు పన్ను శాఖ అధికారులు వరుస షాక్‌లు ఇస్తున్నారు. నటి రకుల్‌ప్రీత్ సింగ్, ఆమె మామ, సినీ నిర్మాత వాషు భగ్నానీ సహా పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు.

సినిమా ప్రాజెక్టులకు నిధులు సమకూర్చే నెపంతో వాటిని విదేశాలకు మళ్లిస్తున్నారనే ఆరోపణలపై అందిన ఫిర్యాదుల మేరకు ముంబై ఐటి అధికారులు ఈ సోదాలు చేబట్టారు. ఏకకాలంలో ముంబైలోని 12 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానిత లావాదేవీలకు సంబంధించిన పత్రాలను ఐటి అధికారులు జప్తు చేశారు.

## 2027నాటికీ రైతుల భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

• వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్న వెల్లడి



**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** రాష్ట్రంలో 2027 మార్చి నాటికీ రైతుల భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పక్కా ప్రణాళికతో రెవిన్యూ యంత్రాంగం రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే ధ్యేయంగా కృషి చేస్తుందన్నారు. భూసమస్యలను సాధ్యమైనంత మేరకు పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు మంత్రి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆర్.హెచ్.పురం, అంట్లవరం, గోదయ్యవలస, సీపురం, చిన్నతుంగం, కోటపాడు, మేఘవరం, కొల్లిపాడు, భావనపాడు గ్రామాల పరిధిలో రీ సర్వే పూర్తయిన 5,100 మంది రైతులకు రాజముద్ర, క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సమక్షంలో దశలవారీగా రీ సర్వే నిర్వహించి, భూముల వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేస్తున్నామని తెలిపారు. రీ సర్వే అనంతరం భూ యాజమాన్య హక్కులను నిర్ధారిస్తూ ఆధునిక భద్రతా లక్షణాలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తున్నట్లు చెప్పారు. దీర్ఘకాలంగా పరిష్కారం కాని భూసమస్యలను కూడా పరిష్కరించి రైతులకు భూ యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

• 3 కోట్లుతో సిమెంట్‌రోడ్లకి శంకుస్థాపన చేశాం
• ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**బుచ్చి (నెల్లూరు), సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలో పలు అబివృద్ధి కార్యక్రమాలు,సిమెంట్‌రోడ్లు నిర్మాణానికి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఎన్నికలలో ప్రజలు మా పైన పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. మున్సిపాల్టీలో ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ప్రజా ప్రతినిధిలు, అధికారులు బాద్యతయుతంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని బుచ్చిరెడ్డిపాళెం రూపురేఖలు మార్పేచేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి అర్బన్ డవలంమెంట్‌కోసం రాష్ట్రం మొత్తం మీద 11 వేల కోట్లు మంజూరు చేయడం జరిగింది అందులో భాగంగా మన జిల్లాకు 380 కోట్లు కేటాయించారు. ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ ప్రారంభోత్సవానికి మున్సిఫల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ వచ్చినప్పుడు 45 కోట్లు కేటాయించగా అందులో 22 కోట్లు మొదటగా మంజూరు చేశారని అందులో భాగంగా రోడ్లు ,డ్రైన్లు నిర్మాణం చేసుకుంటున్నామని అమె స్పష్టం చేశారు. సంవత్సరం లోపు రోడ్లు,డ్రైన్‌లు పూర్తి చేస్తామని అన్నారు.

# భక్తుల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత

• జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్
• పారదర్శకంగా వైదిక సిబ్బంది నియామకం : కమీషనర్ కె రామచంద్రమోహన్



ఎంపి కేశినేని శివనాథ్‌కు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం దసరా ఉత్సవాలకు సంబంధించి ఉదయం ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్‌అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు , రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ జి. ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్. ఎం. ధ్యానచంద్, డీసీపీ జి. రామకృష్ణ, ఇఒ వి.కె. శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ , మరియు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సన్నద్ధత, భక్తుల దర్శన ఏర్పాట్లు, రద్దీ నియంత్రణ, భద్రత, ట్రాఫిక్ మరియు పారిశుద్ధంపై సమగ్రంగా సమీక్షించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 11 నుండి 20వరకు వైదిక కమిటీ సూచనల మేరకు శాస్త్రోక్తంగా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ మహోత్సవాలలో శ్రీ అమ్మవారి దర్శనం కోసం వచ్చే సాధారణ భక్తులు మరియు ఉత్సవాల అనంతరం భవానీ దీక్షల విరమణకు వచ్చే భవానీ భక్తులతో కలిపి దాదాపు 2 5 లక్షల మందికి పైగా తరలివచ్చే అవకాశముందని అధికారుల అంచనాను వివరించారు. ఘాట్‌రోడ్లు, పార్కింగ్ ప్రాంతాలు, దర్శన మార్గాలను సమన్వయం చేస్తూ పటిష్టమైన కార్యాచరణ రూపొందించామని, క్యూలైన్లలో భక్తులకు ఎండ, వర్షం తగలకుండా పూర్తిస్థాయిలో షెడ్లు, నిరంతర తాగునీటి సరఫరా, సేదతీరేందుకు కూర్చునే సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు క్యూలైన్లలో ఎంత సమయం పడుతుందో తెలియజేసేందుకు ఎల్ఈడీ / డిజిటల్ స్క్రీన్లను అమర్చుతున్నామని పేర్కొన్నారు. అధునాతన వసతులతో కూడిన నూతన ప్రసాదాల తయారీ మరియు విశాలమైన అన్నదాన భవనాల ద్వారా భక్తులందరికీ నిరంతరం శుచికరమైన అన్నప్రసాదం అందించనున్నట్లు చెప్పారు. భక్తుల కోసం అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో దాదాపు 60 లక్షల లడ్డూ ప్రసాదాలనుసిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రికి తరలివచ్చే ప్రతి సామాన్య భక్తుడూ ఎంతో సంతృప్తితో, సంతోషంగా అమ్మవారి దివ్య దర్శనం చేసుకుని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఎమ్మెల్సీ వర్ల రామయ్య మాట్లాడుతూ దసరా నవరాత్రులు భక్తులందరి పండుగని, ఇందులో ఎలాంటి వీఐపీ సంస్కృతి లేకుండా సామాన్య భక్తులకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. దేవదాయ శాఖ కమీషనర్ కె. రామచంద్ర మోహన్ మాట్లాడుతూ ఉత్సవాల వేళ విధులతో సంబంధం లేకుండా వివిధ శాఖల సిబ్బంది కొండపైకి రావడం వల్ల కొన్ని సున్నితమైన ప్రదేశాలలో రద్దీ నియంత్రణ సవాలుగా మారుతోందని, ఈ సమస్యను దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, ఏఈవోలు సమన్వయంతో అధిగమించాలని ఆదేశించారు. గతంలో మూలా నక్షత్రం (సరస్వతీ దేవి అలంకారం) రోజున రద్దీ విపరీతంగా పెరిగిపోయి వేలాది మంది భక్తులకు దర్శనం దొరకక నిరాశతో వెనుదిరిగిన సందర్భాలు ఉండేవని గుర్తుచేశారు. గత ఏడాది అటువంటి సమస్యలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టామని, ఈ సంవత్సరం మరింత మెరుగైన రీతిలో సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనం కల్పిస్తామని స్పష్టం చేశారు. విజయవాడ సిపి ఎస్.వి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సరికొత్త ఏఐ కెమెరాలు, సిసిటీవి పర్యవేక్షణ, ప్రత్యేక నియంత్రణ కేంద్రం (కంట్రోల్ రూమ్) ద్వారా 24 గంటలూ కొండపై, పరిసర ప్రాంతాలలో నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా విస్తృతమైన ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేస్తున్నామని, నగర శివార్లలో మరియు ప్రధాన కూడళ్లలో పటిష్టమైన పార్కింగ్ కేంద్రాలను కేటాయించామని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాల నుండి భక్తులను సురక్షితంగా తరలించేందుకు ఉచిత షటిల్ బస్సులను నిరంతరం నడుపుతామని వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ దసరా మహోత్సవాల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేస్తూ విధుల కేటాయింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తుల ఆరోగ్య రక్షణ దృష్ట్యా ఘాట్‌రోడ్లు, క్యూలైన్లు మరియు కీలక ప్రాంతాలలో 24 గంటలు పనిచేసే వైద్య శిబిరాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు మరియు అత్యవసర సేవల కోసం అంబులెన్సులను సిద్ధంగా ఉంచామని వివరించారు.



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## వియత్నాంలో ఉన్నత విద్య

• అంతర్జాతీయ అవకాశాలపై అవగాహన



**తిరుపతి,సెప్టెంబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కమ్యూనికేషన్ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో "వియత్నాంలో ఉన్నత విద్య-పరిశోధన, స్కాలర్‌షిప్‌లు అంతర్జాతీయ అవకాశాలు" అనే అంశంపై సోమవారం ప్రత్యేక సెదస్సు నిర్వహించారు. విభాగంలోని ఈవెంట్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్య విజయలక్ష్మి ప్రారంభ వ్యాఖ్యలు చేశారు. అనంతరం వియత్నాంలోని హోచి మిన్ నేషనల్ అకాడమీ ఆఫ్ పాలిటిక్స్లో లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ లే తు మాక్ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. వియత్నాంలో ఉన్నత విద్య, పరిశోధన రంగాల అభివృద్ధి, భారత్-వియత్నాం విద్యా భాగస్వామ్యాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో అవకాశాలు, స్కాలర్‌షిప్‌లు మరియు అంతర్జాతీయ విద్యా అవకాశాల గురించి వివరించారు. ఇంటరాక్టివ్ సెషన్ లో విద్యార్థులు వియత్నాంలో సామాజిక మాధ్యమంపరిస్థితి, ఉన్నత విద్యలో యువత ఎదుర్కొంటున్న సవాళ్లు, అలాగే సామాజిక కెరీర్‌కు సంబంధించిన సమస్యలపై ప్రశ్నలు అడిగారు. డాక్టర్ లే తు మాక్ విద్యార్థుల ప్రశ్నలకు సమాధానమిస్తూ వియత్నాం పరిస్థితులపై అవగాహన కల్పించారు. వియత్నాం నుండి తీసుకువచ్చిన బుక్‌మార్క్‌లను విద్యార్థుల కు అందజేశారు.

## ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డికి ఊరట

• రూ.50 లక్షల అటాచ్‌మెంట్ ఆర్డర్ రద్దు



**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** సిఎం రేవంత్ రెడ్డిపై ఉన్న 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) చేసిన రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ గతంలో ఇచ్చిన ఆదేశాన్ని అప్పిలేట్ ట్రిబ్యునల్ రద్దు చేసింది. ఈ వ్యవహారంలో రేవంత్ రెడ్డి తో పాటు మరో ముగ్గురికి కూడా ట్రిబ్యునల్ నుంచి భారీ ఊరట లభించింది. ఈ మేరకు ఎస్‌ఏ ఫెమా ఢిల్లీలోని పరిధిలోని అప్పిలేట్ ట్రిబ్యునల్ ఈనెల 14వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ మునీశ్వర్ నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. రేవంత్ రెడ్డి, వేమ్ కృష్ణ కీర్తన్, రుద్ర శివకుమార్ ఉదయ్ సింహా, బిషప్ హ్యారీ సెబాస్టియన్‌లు.. 2022 ఫిబ్రవరి 8వ తేదీన అడ్జుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేశారు. అంతకు ముందు 2021 మే 25వ తేదీన ఈడీ రూ.50 లక్షలను ప్రొవిజనల్‌గా అటాచ్ చేసింది. ఈ ఓటుకు నోటు కేసులో అసలు వివాదం రూ.50 లక్షల మొత్తానికి సంబంధించింది కాగా.. ఈ మొత్తాన్ని లంచంగా ఇవ్వబోయినట్లు ఆరోపణలు ఉన్న నగదుకు సమానమైన మొత్తాన్ని ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది. అయితే అప్పీలుదారుల తరపున.. అసలు నగదును ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) స్వాధీనం చేసుకుని.. ట్రయల్ కోర్టు లో డిపాజిట్ చేసిందని వాదించారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ)లోని సెక్షన్ 5(1)()లోని నిబంధనలను ట్రైబ్యునల్ పరిశీలించింది. ఇప్పటికే రూ.50 లక్షలు కోర్టు ఆధీనంలో భద్రంగా ఉన్నప్పుడు.. ఆ మొత్తాన్ని నిందితులు తరలించడం, ఇతర విధంగా వినియోగించే అవకాశం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ పరిస్థితుల్లో అదే మొత్తానికి సమానమైన మరో రూ.50 లక్షలను అటాచ్ చేయాల్సిన పరిస్థితి లేదని ట్రైబ్యునల్ పేర్కొంది. దీంతో రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ అడ్జుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన ఆదేశాన్ని కోర్టు రద్దు చేసింది. 2015లో తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఈ ఓటుకు నోటు కేసు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. జూన్ 1వ తేదీన జరగాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు ఓటు కోసం రూ.5 కోట్ల లంచం ఆఫర్ చేశారనే ఆరోపణలపై హైదరాబాద్ ఏసీబీ అధికారులు 2015 మే 31వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## శక్తి యాప్‌తో అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సాయం

• ఆపరేషన్ త్రిశూల్‌లో వైద్యవిద్యార్థులకు అవగాహన




**తిరుపతి,సెప్టెంబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల,యువతుల భద్రతలో భాగంగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగిస్తే అత్యవసర పరి స్థితుల్లో పోలీసుల సాయం అందుతుందని తిరు పతి మహిళ అదనపు ఎస్పీ ఎం.శ్రీలత తెలిపారు. ఈ విధానం గురించి తెలియజేస్తూ అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను వెంటనే సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా సోమవారం తిరుపతి శ్రీవేంకటేశ్వర వైద్యకళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శక్తి టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ ఎం. శ్రీలత విద్యార్థులకు మహిళలు, విద్యార్థుల భద్రత, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హనీట్రాప్‌లు వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమాజంలో ఇటీవల చోటుచేసుకున్న మహిళలకు సంబంధించిన ఘటనలను ఉదాహరణలుగా వివరించారు. యువత చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ మోసాలకు దూరంగా ఉంటూ తమ చదువు, భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి సారించాలని, చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్112 తో బాటు సంబంధిత అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని పోలీసు అధికారులు సూచించారు.

## కొల్లేరు వన్యప్రాణి సంరక్షణే సుప్రీంకోర్టు సాధికార కమిటీ లక్ష్యం

• కాంతీలాల్ దండే



**ఏలూరు, సెప్టెంబరు 28 (ప్రభాతవార్త):** కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి సంబంధించి సుప్రీంకోర్టు సాధికార కమిటీ కోరిన సమగ్ర సమాచారాన్ని అక్టోబర్05వ తేదీలోగా అందించాలని అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతీలాల్ దండే అధికారులను ఆదేశించారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో కొల్లేరు అభయారణ్యంపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కొల్లేరు 5వ కాంటూర్ పరిధిలో అభయారణ్య సరిహద్దుల హేతుబద్ధీకరణ, జిరాయితీ, డిపట్టా భూముల వివరాలు, భూమిదారుల పునరావాసం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. అభయారణ్య పరిధిలో వన్య ప్రాణి సంరక్షణ చట్టం అమలు, భూముల సమస్యలు, పునరావాసానికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే సుప్రీం కోర్టు సాధికార కమిటీకి సమర్పించామని కాంతీ లాల్ దండే తెలిపారు. మరింత సమాచారం కోరిన నేపథ్యంలో అధికారులు సమగ్ర వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుత అభయారణ్య విస్తీర్ణం, సరిహద్దుల హేతు బద్ధీకరణ అనంతరం మారే విస్తీర్ణం, ప్రభుత్వ, జిరాయితీ, డిపట్టా భూముల వివరాలు, మండలాల వారీగా భూమిదారుల తరలింపు ప్రతిపాదనలు, జిల్లా-మండల సరిహద్దులు, ఉప్పుటేరు సహా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పక్షుల ప్రాంతాలు, నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ డ్రైన్ల వివరాలను నివేదికలో పొందుపరచాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు అక్టోబర్ 5లోగా వివరాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని, వాటన్నింటినీ క్రోడీకరించి ఏలూరు జిల్లా కలెక్టర్ అక్టోబర్ 6వ తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించాలని కాంతీలాల్ దండే స్పష్టం చేశారు. ఈసమావేశంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్, పీసీసీఎఫ్ డా. పి.వి. చలపతిరావు, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్లు రాహుల్ పాండే, నాగేశ్వరరావు, జ్యోతి, జాయింట్ కలెక్టర్లు డా. ఎం.జె. అభిషేక్ గౌడ, కె.ఆర్. కల్పశ్రీ, డీఎఫ్‌ఓలు సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**విజయవాడ, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో అవకతవకలు, అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల నమోదు ప్రక్రియలో మార్పులు, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతపై లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం పత్రాధారాలతో సమాధానం ఇవ్వాలని ఏపీసీసీ డిమాండ్ చేస్తోందని ఏపిసిసికార్యనిర్వాహక అధ్యక్షులు జె.డి. శీలం వెల్లడించారు. ఈ అవకతవకలపై ఏఐసీసీ ఆదేశాల మేరకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి పిలుపుతో విజయవాడలో కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఏపీ సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఎన్నికల కమిషనర్ల స్థాయిలో నమోదైనట్లు పేర్కొంటున్న 14 అభ్యంతరాలపై ఫైల్ నోటింగ్స్, మినిట్స్, యాక్షన్ టేకెన్ రిపోర్టులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఫారం6లో చేసిన మార్పులకు చట్టపరమైన ఆధారం, సంబంధిత గెజిట్ నోటిఫికేషన్‌ను వెల్లడించాలని, ఇసిఐనెట్ డేటా భద్రతపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని, గోవాలో ఓటర్ల తొలగింపుపై వచ్చిన నివేదికలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే శీఃశి ప్రక్రియను స్వతంత్రంగా సమీక్షించే వరకు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల కార్యాలయం ముందు జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. నిరసన అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి పై అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కొలనుకొండ శివాజీ, వి.గురునాథం, వేగి వెంకటేష్, నాగమధు యాదవ్, ఎన్.పవన్ తేజ నాయుడు, అమార్జా బేగ్ మహమ్మద్, బొర్రా కిరణ్, నరహరిశెట్టి నరసింహా రావు వంటి నేతలతో పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా వున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మరోసారి వెలుగులోకి అలుగోలు

• రైల్వేలో మూడు ఉద్యోగాలు సాధించిన సతీష్

**నెల్లిమర్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** నెల్లిమర్ల మండలంలో అదో మారుమూల గ్రామం. మండల కేంద్రంలో నెల్లిమర్లకు 16 కిలోమీటర్లు, జిల్లా కేంద్రానికి 26 కిలోమీటర్ల దూరంలో ఉంది ఆ గ్రామం. ఆ గ్రామం పేరే అలుగోలు. వివిధ రకాల ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించడంలో ఆ గ్రామం మేటిగా నిలుస్తున్నది. గత ఏడాది కెల్ల ఉదయ పావని అనే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ గ్రూప్ 1 క్యాడర్‌లో డిఎస్పి ఉద్యోగం సాధించి గ్రామ కీర్తిని రెపరెపలాడించింది. ఇటీవల అదే గ్రామానికి చెందిన నాగారపు వెంకటరమణ అనే ఆర్మీ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డీఎస్పీగా ఉద్యోగ ఉన్నతి లభించి మరోసారి ఆ గ్రామం పేరు వెలుగులోకి వచ్చింది. తాజాగా అదే గ్రామానికి చెందిన మరో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అలుగోలు సతీష్ రైల్వేలో ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించి అలుగోలు గ్రామ కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాడు. సతీ ష్ భువనేశ్వర్ కేంద్రంగా నడుస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వేస్ లో అసిస్టెంట్ లోకో పైలట్, ట్రైన్ మేనేజర్ (గూడ్స్), జూనియర్ ఎకౌంట్స్ అసిస్టెంట్ ఉద్యోగులు సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. సతీష్ తండ్రి కాళిదాసు కొంతకాలం అదే గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహించి తన కుటుంబాన్ని పోషించారు. సతీష్ ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్వగ్రామం అలుగోలు లోనే విద్యనభ్యసించాడు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించడం ద్వారా శ్రీకాకుళం ఐ ఐ ఐ టి లో సీటు సొంతం చేసుకుని పియుసి,బీటెక్ ( మెకానికల్) చేశాడు. బిటెక్ పూర్తి చేసిన అనంతరం పోటీ పరీక్షలు పై దృష్టి సారించి విజేతగా నిలిచాడు. సతీష్ ను గ్రామ పెద్దలు సార్కి వైకుంఠం నాయుడు, కురిమినేని దివాకర్, ఆల్తి బాబురావు తదితరులు అభినందించారు.

## ప్రెసిడెన్షియల్ ఆర్డర్-2025ను తక్షణం నిలిపివేయాలి

• ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్

**విజయవాడ, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** ప్రెసిడెన్షియల్ ఆర్డర్-2025ను తక్షణం నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఈఏ) అధ్యక్షుడు కాశీభట్ల రామసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలో యూనియన్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ, ఉద్యోగులు మరియు నిరుద్యోగుల్లో గందరగోళానికి తెరతీసిన ఈ నూతన జోనల్ వ్యవస్థ వల్ల రాష్ట్రానికి ఎటువంటి ఉపయోగం లేదని, రాష్ట్రం విడిపోయిన తరువాత జోనల్ వ్యవస్థ అవసరం లేదని, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అభిప్రాయపడుతుందన్నారు. నూతన వ్యవస్థను సమీక్షించాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం కూడా సమర్పించామని తెలిపారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025 యొక్క రాజ్యాంగ చట్టబద్ధతపై వివిధ న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన మీదట ఉన్నత న్యాయస్థానాల్లో వ్యాజ్యం వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఆర్డర్‌ను అమలుచేసే ముందు, దాని పరిధి, ఆర్టికల్ 371డితో దాని అనుసంధానం, ఇప్పటికే సేవలో ఉన్న ఉద్యోగులపై దాని ప్రభావం, అలాగే సీనియారిటీ-పదోన్నతి-సంపాదించిన సేవా హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై నిపుణుల స్థాయి పరిశీలన జరపాలని సంఘం కోరుతోందన్నారు.

అవసరమైన చోట సంబంధిత ఉత్తర్వులు, స్థానిక క్యాడర్ నిర్మాణం మరియు అమలు చర్యలను పునఃపరిశీలించి, ఉద్యోగుల హక్కులకు భంగం కలగకుండా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025పై ఉద్యోగులు, సామాన్య ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో చర్చా గోష్టులునిర్వహించాలని సంఘం నిర్ణయించిందని తెలిపారు.

## నెల్లూరు సిటీలో అభివృద్ధి పరవళ్లు

• ఒక్కరోజే రూ.7.59 కోట్ల పనులకు శ్రీకారం • మంత్రి నారాయణ



**నెల్లూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త - వైద్యం :** నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. నగరంలోని పలు డివిజన్లలో సోమవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ విస్తృతంగా పర్యటించి రూ.7.59 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, చేశారు. రహదారులు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, గ్రీనరీ, పార్కులు, ఫౌంటైన్లతో పాటు క్రీడా సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. 52వ డివిజన్ రంగ నాయకుల పేట పెద్ద మసీదు సెంటర్‌లో రూ.39 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి భూమిపూజ చేశారు. 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీలో రూ.1.70 కోట్లతో డివైడర్, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నగరంలోని ఎండ్‌టు ఎండ్ రోడ్లన్నింటినీ త్వరలో పూర్తి చేస్తామని, శంకుస్థాపన చేసిన పనులన్నీ రెండు నెలల్లో పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. 53వ డివిజన్ వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ కింద రూ.4 కోట్లతో చేపట్టనున్న గ్రీనరీ, బ్యూటిఫికేషన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో షటిల్ కోర్టు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా అక్కడికక్కడే అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. గాంధీ గిరిజన కాలనీలో రూ.1.50 కోట్లతో నూతన పార్కు పనులను ప్రారంభించారు. ముత్తుకూరు గేట్ సెంటర్‌లో ఆనం వెంకటరెడ్డి విగ్రహం వద్ద ఫౌంటైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

29 -9Pg9th cheli.qxd:29 -9Pg9th cheli.qxd 1/1/02 5:58 AM Page 1



# మేకప్‌కూ రూల్సుంటాయి!



ఆఫీసు లేదా ఫంక్షన్‌కి వెళ్లడానికి రెడీ అవుతామా! క్రీం దొరికితే లిప్స్టిక్ దొరకదు... ఈ రెండు దొరికితే ఐలైనర్ కనిపించదు. దానితో డ్రెస్సింగ్ టేబుల్ సొరుగు మొత్తం వెతికేస్తాం. కావాల్సిన వస్తువులు ఒకటికి రెండున్నా సమయానికి చేతికి దొరకకపోతే. ఆ టైంలో చిరాకు రాకమానదు. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే మేకప్ డ్రాయర్ రూల్ పాటించి చూడండి. ఈ పద్ధతిలో సౌందర్య వస్తువుని సర్దుకుంటే వస్తువులు త్వరగా దొరకడంతోపాటు ముస్తాబయ్యే సమయం కూడా ఆదా. దీని కోసం ఏంచేయాలంటే సన్‌స్క్రీన్, కాజల్, లిప్స్టిక్... రోజూ వాడేవే కాబట్టి వీటిని ముందు భాగంలో పెట్టుకోవాలి. అప్పుడప్పుడు వాడే ఐషాడో ప్యాలెట్లు, బ్రైట్ షేడ్స్ వెనక భాగంలో సర్దుకుంటే పని సులువవుతుంది. కొన్ని మేకప్ వస్తువులకు గడువు తేదీ ఏడాది ఉంటే... మూడు నాలుగు నెలల్లోనే ఎక్స్‌పైర్ ఉంటాయి. గడువు ముగిసినా వాటిని బయటపడేయకుండా కొత్తగా తెచ్చుకున్నవి వాటితో కలిపేస్తాం. అలా చేస్తే చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే గడువు చెల్లిన వాటిని తొలగించాకే కొత్తవాటిని సర్దుకోవాలి. ఒక్కోసారి హడావుడిలోపడి మేకప్ పూర్తయ్యాక వాటి మూతలు పెట్టకుండా ర్యాక్ పడేస్తాం. దీనివల్ల అవి ఇతర సామగ్రికి అంటుకొని సొరుగు మొత్తం చిందరవందరగా కనిపిస్తుంది. అంతేకాదు, వాటిల్లోకి తేమ చేరి పెరిగే అవకాశం ఎక్కువ. అందుకే మేకప్ పూర్తికాగానే మూత పెట్టడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. మేకప్ అంటే స్కిన్ కేర్ ఒక్కటేనా..హెయిర్ కేర్ కూడా ఉంటుంది కదా. ఈ రెండు రకాల ఉత్పత్తులను కలపొద్దు. □

# ఉత్తమ మార్గం !

ఈ రోజుల్లో చాలా మంది ఎవరికి వారే ఉత్తములు అని బిరుదులు ఇచ్చుకుంటున్నారు. ఇది చాలా హాస్యాస్పదం. మేము గుడిలో దానాలు, దీపాలకు నూనె ఇస్తు న్నాం, పేదలకు దానం చేస్తున్నాం అనే భరోసా వాళ్ళకు ఉంది. కానీ ఆచరణలో వాళ్ళ ప్రవర్తన వేరే. ఒక ప్రక్కదైవ ధర్మ గ్రంధాలు చదువుతూ,ఆమె ఇట్లా, ఈమె అట్లా అని సంభాషిస్తూ మళ్ళీ గ్రంధాలలో నిమగ్న మై పోతారు. ఏదో చదివాము అనే మూస ధోరణి వాళ్ళకు ఉంటుంది. ఇవేమి ఫలితం ఇవ్వవు. దైవ గ్రంధాలు ప్రశాంతంగా వీలు ఉన్నప్పుడు చదువు కోవాలి. ఇతరుల మాటలు పట్టించు కోరాదు. ఓ ముదు సలి ఉదయమే కృష్ణా, రామ, సాయిరాం అనుకుంటూ లేచి పలువురిని ఇబ్బంది పెడుతుంది. నడవడానికి చేత కానప్పుడు నిదానంగా, ప్రశాంతంగా, ఎవరితో మాట్లాడక వారి పనులు వారే చేసుకోవాలి,ఆలస్యం అయినా పర్వాలేదు. అసలు వృద్ధులు మనసులో ఆ భగవంతుణ్ణి తలచుకుంటే చాలు అదే పది వేలు. అటువంటి వారే ఉత్తములు. అంతే కాని నేను రోజూ ఆ దైవాన్ని తలుస్తున్నా నేనే ఉత్తమురాలు, ఉత్తముడు అనుకుంటే ఆది వ్యంగ్యం ఉంటుంది. మన గురించి ఇతరులు గొప్పగా చెప్పుకుంటే అంత కన్నా ఫలితం ఉండదు. ఉత్తమం అంటే ఏ వ్యాపకాలు లేకుండా, శక్తికి మించి దానాలు చేయకుండా, ముందు నీ ఇంటిలోని వారిని బాగా చూసుకుంటే ఆదే ఉత్త మొత్తమం. చేత కానప్పుడు అన్నీ వదిలేసి మదిలో దైవాన్ని తల్చుకుంటే చాలు.చేత కాకున్నా ఉదయమే దైవాన్ని కొలవడం, అందరికి అడ్డం రావడం శ్రేయస్కరం కాదు. అవసాన దశలోసంతానం లో ఎవరూ సేవలు అందిస్తారో వారికే ఫలం ఇవ్వాలి. అంతే కాని అందరికి సగం సగం అనే భ్రాంతి పోవాలి. కొడుకులు అయినా, కోడళ్ళు అయినా, బిడ్డలు అయినా సేవలు అందించే వారికే ప్రతి ఫలం ఉంటుంది. ఇది సత్యం. సేవలు చేయని వారికి ఇస్తే నీకే పాపం వస్తుంది. అప్పుడు ఏ దేవుడు నీ మొర ఆలకించడు. నీ ఆస్తి నీ ఇష్టం. నీ బంగారు నీ ఇష్టం. ఎవరికైనా అంటే నీ సేవలు చేసే వారికే ఇవ్వాలి. ఈ వయసులో నీకు సుద్దులు ఉండరాదు. ఆధ్యాత్మిక్నగానే ఇతరులతో మాట్లాడాలి. ఎవరి గురించి అనవసరంగా చర్చ చేయరాదు. ఈ వయసులో నిబ్బరం ఉండాలి. పౌరుషానికి పోరాదు. ఆచి, తూచి మాట్లాడాలి. ఏ సమస్యలు లేక మోనంగా ఉండాలి. సమయానికి తిండి ఉంటే చాలు. ఏ కోరికలు ఉండరాదు. చేత కాకున్నా పోవాలంటే ఓ కారు లో వెళ్ళు, అంతే కాని బస్సు లలో వెళ్లడం మంచిది కాదు. నువ్వు ఏ కోవెలకు వెళ్లినా, ఇంటి పట్టున వున్నా మోనంగా ఉండు అదే ఉత్తమం.

# పాలతో ఇద్దాం !



కొంతమంది పిల్లలు పాలు తాగడానికి ఇష్టపడరు. అవి వారికి రుచించక పోవడమే ఇందుకు కారణం. దీనితో వారి శరీర ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు అందకుండా పోతాయి. అలా జరగకుండా ఉండాలంటే నేరుగా కాకుండా.. వాటిలో కొన్ని పాల పదార్థాలు కలపడం వల్ల రుచికరంగా పిల్లలకు అందించవచ్చు.

పిల్లలు ఇష్టంగా పాలు తాగాలంటే.. రకరకాల పండ్ల ముక్కలు వేసి స్మూతీలుగా, మిల్క్ షేక్స్‌గా తయారు చేసి ఇవ్వచ్చు. అయితే వీటి తయారీలో పండ్ల పరిమాణం కాస్త తక్కువగా, పాల పరిమాణం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎక్కువ మొత్తంలో పాలు వారికి ఇవ్వచ్చు. అలాగే చక్కెర మరీ ఎక్కువగా వేయకూడదు. పోషకాహార నిపుణుల సలహా తీసుకొని రుచి కోసం కలిపే కొన్ని పొడర్లు, పదార్థాలను ఎంచుకోవచ్చు. ఫలితంగా పిల్లలకు పాలు రుచిగా మారడంతో పాటు క్యాల్షియం వంటి పోషకాలు పిల్లలకు సమృద్ధిగా అందుతాయి. కార్న్ ఫ్లేక్స్, చాకోస్.. పాలలో కలిపి ఇవ్వడం వల్ల పాలు మరింత రుచిగా ఉంటాయి. ఫలితంగా వారు ఆ పదార్థాలను తిని పాలు తాగుతారు. ఈ చక్కెర మోతాదు తక్కువ " ఉన్న వాటిని మర్చిపోవద్దు. అలాగే ఓట్మీల్, పాస్తా.. వంటి పదార్థాల్లో నీళ్లకు బదులుగా పాలను ఉపయోగించడం మంచిది. □

# ధ్యానంతో సరి !



ఒక్కోసారి ఎంత వద్దనుకున్నా.. ప్రతికూల ఆలోచనలు మనసుని వేధిస్తుంటాయి. అనారోగ్యం.. ఇంట్లోనో ఉద్యోగంలోనో సమస్యలు.. కారణాలు.. ఎక్కువ రోజులు ఇవే ఆలోచనలతో గడపడం మంచిది కాదు.. అందుకే మనసు బాలేనప్పుడు కాస్త కొద్ది నిమిషాల పాటు ధ్యానం లేదా శ్వాస మీద ధ్యాస పెట్టడం ఏర్పాటు చేయండి. ఆ తర్వాత పాజిటివిటీని పెంచే కొటేషన్స్ చదవండి. ప్రసంగాలు వినండి.

పాజిటివ్ మూడ్‌లోకి రావాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. నెగెటివ్ థింకింగ్ బాగా ఎక్కువగా ఉన్నప్పుడు మీకు నచ్చిన పాట వినడమో, పాడడమో చేయండి. మనసుకు కాస్త ప్రశాంతత లభిస్తుంది. ఫలితంగా ఆలోచన ధోరణిలో మార్పు వచ్చే అవకాశాలుంటాయి. మీరు ఉన్న ప్రదేశం నుంచి బయటకు వచ్చి కాసేపు అటూఇటూ నడవండి. ఈ సమయంలో మీకు బాగా నచ్చిన అంశాల గురించి ఆలోచించడానికి ప్రాధాన్యత ఇవ్వండి. మీకు బాగా ఇష్టమైన అభిరుచి పైన దృష్టి పెట్టి చూడండి. అసలు ప్రతికూలంగా ఆలోచించే సమయం కూడా ఉండదంటే అతిశయోక్తి కాదేమో! ప్రతి విషయంలోనూ సానుకూలంగా ఆలోచించండి. ఎంత నియంత్రించుకుందామని ప్రయత్నించినా నెగెటివ్ ఆలోచనలు అస్సలు ఆగట్లేదా? అయితే ముందుగా మీ మెదడుకు విశ్రాంతిని ఇవ్వడం చాలా అవసరం. కాబట్టి తప్పకుండా ఫలితం కనిపిస్తుంది. .. వేదించే ఆలోచనల నుంచి బయటకు రావాలంటే మనసు దృష్టిని మళ్లించే మరో పని ఏదో ఒకటి చేయాలి. ఈ ప్రయోజనాలే ఇతరులకు సహాయం చేయడం, సమాజ సేవలో పాల్గొనడం వంటివి చేసి చూడాలి. □

# బడాయికి పోతే బంగారం మాయం !



ఏమిఆడంబరమోనమ్మా! మొన్న పక్కింటి మీనాక్షి వాళ్లాయన 'రవ్వల హారం' కొన్నారని తెగ మురిసిపోయింది. నిన్న కామాక్షి కాసులపేరుతో ఊరంతా కలియ తిరిగి గుమ్మం గుమ్మానికీ వెళ్లి పొద్దుటే బడాయి పోయింది. నాకూ ఉన్నాయలేమ్మా! ఏడువారాల నగలు నేనెలా మురిసిపోవాలి. నాకూ ఉన్నాయి చూడంటూ బీరువాలో ఉన్న నగలన్నీ తెచ్చి అమ్మలక్కల ముందు పోసింది. ఎవరికి వారు వాటిని తమకైతే ఎలా ఉంటాయో అని వంటికి తగిలించు కొంటారు. ఇలాంటి 'గొప్ప'లకు పోయి తమ నగలన్నీ ఇతరులకు చూపెట్టడం వారు అంతో ఇంతో పొగిడేసి వెళ్లిపోవడం తెలుగునాట ఎన్నో చోట్ల కంటుంటాము. వింటుంటాము. అంతేకాదు. ఆ యిల్లు ఈ ఇల్లు తిరుగుతూ గొప్పవారి గోతాల్లో నగల గురించి ఆ నోటా ఈ నోటా జనాల్లోకి వెళ్లిపోవడం కద్దు. అంతే కాదు ఓ యూట్యూబర్ అయితే తనకున్న నగలన్నింటినీ తన కొచ్చిన విద్యతో యూట్యూబ్‌లో ప్రదర్శనకు పెట్టేసింది. బాగా వైరల్ అయిపోయింది. దీన్ని తిలకించిన చోర శాఖామణులు అలా చూస్తూ ఊరుకుంటారా తమ హస్తలాఘవాన్ని చూపించరూ! అదే జరిగింది. ఇది యధార్థ సంఘటన. తమిళనాడులోని నాగర్ కోయిల్‌లో మధుమిత అనే ఓ అమ్మడు బేషజం కోసమో! మరేమనుకుందో యూట్యూబ్, ఇన్‌స్టాలో డబ్బు, బంగారం చూపిస్తూ వీడియోలు పెట్టేసింది. అలా చూసే వారికి ఎవరికి మాత్రం 'ఆశ' పుట్టదు అయినా ఆమె ఊర్లో ఉండనన్న సమాచారమూ అంతే గొప్పగా అదే యూట్యూబ్‌లో పెట్టేసింది. చేతిలో పనికదా! 'వ్యూయర్స్' కోసం అయి ఉంటుంది. సోషల్ మిడియాలో సంపదను ప్రదర్శించడం ఎంత తప్పో, మహిళలు తెలుసుకోవాలి. కన్యాకుమారి జిల్లా నాగర్ కోయల్ సమీపంలోని తమ్మత్తు కోణం విఐపిగా లైన్‌లో ఆమె నివాసం. ఆమె యూట్యూబ్ ఛానల్‌కు 42 వేల మంది వ్యూయర్‌లు ,ఫాలోవర్‌లున్నారు. బీరువాలోని బంగారు నగలు, వజ్రా భరణాలు, నగదును రీల్స్‌లో ఘనంగా చూపింది. రూ.500 నోట్లను తన పిల్లాడిపై సంబర పడిపోయింది. ఇలా మన విషయాలు, సంపదను ఇతరులకు తెలిసేలా ప్రదర్శిస్తే అదెలా వికటిస్తుందో ఇదే ఉదాహరణ. 'లైక్'ల కోసం జీవితాన్ని పణంగా పెట్టడం అంటే అది ఎంత వెట్టితనమో తెలిసి వచ్చినట్లే కదా! బోగిపండ్లు పోసినంత ఉత్సాహంగా పోసి మరెంతగానో అలా 'వ్యూ' చూసిన వారు అలా ఊరుకుంటారా! గ'మ్మత్తు'గా ఆ యింటికి కన్నం వేసి ఊడ్చుకుపోయారు. ఇంకేముంది ఆ 'యూట్యూబర్' లబోదిబో! నగల పట్ల ఎంత జాగ్రత్తగా ఉండాలో హెచ్చరికగా ఉంటుందనే ఈ కథనం ఇలా! అతివలూ తస్మాత్ జాగ్రత్త.

# ఉల్లి రింగులతో..



గుడ్లు: రెండు, ఉల్లిగడ్డ: ఒకటి (పెద్దది), పచ్చిమిర్చి: రెండు, టమాట: ఒకటి (చిన్నది), కారం: అర టీస్పూన్, పసుపు: పావు టీస్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా, శనగపిండి: ఒక టీస్పూన్, మిరియాల పొడి: పావు టీస్పూన్, ఉప్పు: తగినంత, నూనె: కొద్దిగా

**తయారీ విధానం:** ఉల్లిగడ్డను అడ్డంగా కోసి గుండ్రని రింగులను పక్కన పెట్టి మిగతా ముక్కలను సన్నగా తరగాలి. ఒక గిన్నెలో గుడ్లలోని సొన వేసి, అందులో ఉల్లి తరుగు, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, టమాట ముక్కలు, కొత్తిమీర తురుము, శనగపిండి, కారం, మిరియాలపొడి, ఉప్పు, పసుపు వేసి బాగా కలుపుకోవాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి ఒక టేబుల్ స్పూన్ నూనెవేసి వేడయ్యాక ఉల్లి రింగులను ఉంచి వాటి మధ్యలో ఇందాక కలుపుకొన్న గుడ్ల మిశ్రమాన్ని వేయాలి. సన్నని మంటపై రెండువైపులా కాల్చుకుంటే నోరూరించే ఆనియన్ ఎగ్ రింగ్స్ సిద్ధం.

తెర

# 'తత్వం'లో నటించడం లక్కీ: దష్వికా



**మీ నేపథ్యం?**
నా పేరు దష్వికా.కె .నా స్వస్థలం వైజాగ్. ఇది నా తొలిసినిమా.. సినిమా హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వాలనే ప్రయత్నంలో ఉన్న టైమ్‌లో ఈ సినిమా అవకావం వచ్చింది. తత్వం.. అడిషన్స్ చేసి సెలక్ట్ చేశారు. గతంలో నేను హీరో విజయ్ దేవరకొండతో కలిసి ఓ వాణిజ్య ప్రకటనలో నటించాను.

**తత్వంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వడం ఎలా అనిపిస్తుంది?**
ఫస్ట్ ప్రాజెక్ట్‌లోనే ఓ హీరోయిన్‌కు నటనకు స్కోప్ ఉన్న పాత్ర దొరకడం లక్కీగా ఫీలవుతున్నాను.

**ట్రైలర్ చూస్తే మీ పాత్రలో నెగెటివ్ షేడ్స్ కనిపిస్తున్నాయి?**
నా పాత్రలో గ్రే షేడ్స్ ఉంటుంది. బట్ అందరికి నచ్చే పాత్ర అది. ఇంతకు మించి ఇప్పుడు రివీల్ చేయకూడదు.

**తత్వం చిత్రంలో మీ పాత్ర ఎలా ఉంటుంది?**
సాఫ్ట్ కైండ్ ఆఫ్ గర్ల్.. హీరోకు సపోర్ట్‌కు ఉండే పాత్ర. కిల్లర్‌ను అన్వేషణలో హీరోకు సపోర్ట్ చేస్తూ ఉంటే టపాజిటివ్‌గా ఉండే పాత్ర నాది.

**తత్వం సినిమా ఎలా ఉండబోతుంది.**
జనరల్‌గా మలయాలంలో ఇలాంటి స్టోరీలు వస్తుంటాయి. తెలుగులో కూడా ఇలాంటి కథతో సినిమా రావడం ఆనందంగా అనిపించింది.

**హీరోయిన్ అవ్వాలని ఎందుకు అనుకున్నారు.**
చిన్నప్పటి నుంచి నాకు యాక్టింగ్ ఇష్టం. మూడో తరగతిలోనే నేను నటిని అవుతానని మా టీచర్‌కు చెప్పాను. సినిమా, మోడలింగ్ అంటే ఇష్టం. అమ్మ నాన్న కోరిక మేరకు స్టడీస్ కంప్లీట్ అయిన తరువాత సినిమాలోకి అడుగుపెట్టాను.

**సినిమాల్లోకి వచ్చే ముందు సినిమా ఇండస్ట్రీ గురించి చెప్పిన మాటలు విని భయపడ్డారా?**
వచ్చే ముందు భయపడ్డాను. టెన్షన్ పెడ్డాను. అయితే ఏద్దైనా మనం మేనేజ్ చేస్తూ ఏ ఫీల్డ్‌లోనైనా ఎదగాలి అని అర్థమయింది..

**హీరో దినేష్ తేజ్ గురించి?**
దినేష్ వెరీ సపోర్టింగ్. యాక్షన్ సీక్వెన్సీలో నాకు బాగా సపోర్ట్ చేశారు. ఆయన పాత్ర ఈ సినిమాలో బాగుంటుంది.

**దర్శకుడు అర్జున్ కోలా గురించి?**
దర్శకుడు అర్జున్ కోలా చాలా సైలెంట్.. ఓ స్టాఫ్టవేర్ జాబ్ చేస్తున్నాడు. మూడు నెలలు లీవ్ తీసుకుని ఈ సినిమా చేశాడని తెలిసి ఆశ్చర్యపోయాను.

**ఈ సినిమాలో ఇంకా హైలైట్‌గా ఏమిటి?**
కథ, కథనాలతో పాటు చేతన భరద్వాజ్ సంగీతం ఆర్‌ఆర్ హైలైట్‌గా ఉంటుంది.

# 'ఆదర్శ కుటుంబం' 'నారాయణమ్మ' పాట విడుదల



నారాయణమ్మ గీతావిష్కరణ దస్పల్లా హోటల్ లో ఘనంగా జరిగింది. చిత్ర బృంద మంతా ఈ వేడుకలో సందడి చేసి, ప్రచార కార్యక్రమా లను ఘనంగా ప్రారంభించింది.ఈ సంద ర్భంగా విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. నారాయణ మ్మ సాంగ్ లాంచ్‌కి విచ్చేసిన అభిమానులకు, మీడియా మిత్రులకు ధన్యవాదాలు. దాదాపు 20 ఏళ్ళ తర్వాత త్రివిక్రమ్‌తో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలు క్లాసిక్ లవ్ స్టోరీలు. అలాంటి సినిమాల తర్వాత ఇప్పుడు త్రివిక్రమ్ మరో అద్భుతమైన కథను తీసుకొచ్చారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "ఈరోజు హీరోలు తమన్, రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ వెంకటేష్ ఎ, హీరోయిన్లు. నేను ముందుగా థాంక్స్ చెప్పాల్సింది డింపుల్ గారికి. సాంగ్ షూట్ చేసే సమయానికి ఆమెకి ఒంట్లో బాలేక పోయినా.. ఇష్టపడి, కష్టపడి చేశారు. మీ అందరి లాగే నా ఫేవరెట్ హీరో వెంకటేష్ . నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో, నేను మొట్ట మొదటిగా పెన్ను పెట్టి రాసిన డైలాగ్ ఆయన సినిమాకే. పవిత్ర బంధం. నా జర్నీ ఆయనతోనే స్టార్ట్ అయింది. సంగీత దర్శకుడు తమన్ ఎస్ మాట్లాడుతూ.. "వెంకటేష్‌తో సినిమా చేయడం అనేది డ్రీమ్ లాంటిది. వెంకటేష్ గారు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో సినిమా కోసం నేను ఎంతగానో ఎదురు చూశాను. ఇప్పుడు వారి కాంబినేషన్ లో ఆదర్శ కుటుంబం వస్తుండటం, అందులో నేను భాగం కావడం సంతోషంగా ఉంది. నటి శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. "చినబాబు, నాగవంశీ గారు నాకు ఈ సినిమాలో నటించే గొప్ప అవకాశాన్ని ఇచ్చారు. నాకు త్రివిక్రమ్ గారి సినిమాలంటే చాలా ఇష్టం. నటి డింపుల్ హయాతి మాట్లాడుతూ.. చాలా కాలం తర్వాత నేను ప్రత్యేక గీతం చేశాను. నా మొదటి పాటకు వెంకటేష్ అతిథిగా విచ్చేశారు.

# 'రిచ్' పూజా కార్యక్రమాలతో ప్రారంభం



బేబీ ఆరాధ్య ఆదర్శ్ సమర్పణలో ఎంజి ఆర్ట్స్, ఐఎఫ్ఎక్స్ స్టూడియోస్ ప్రై.లి బ్యానర్లపై పద్మనాభ రెడ్డి, మార్గం గోపి, మహేంద్ర ఎస్ గైక్వాడ్ కో ప్రొడ్యూసర్‌గా సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం˝రిచ్. ఏ బస్తీ బాయ్ లవ్ స్టోరీ అనేది ఉపశీర్షిక. మోహిత్ పెడాడ, శ్రీజిత ఘోష్ జంటగా నటిస్తున్న ఈ మూవీని రాజా నరేంద్ర తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమాన్ని ..నిర్మాత పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ.. .. రాజా నరేంద్ర రిచ్ కథను చాలా రిచ్‌గా చెప్పారు. ఆ తర్వాత ఈ కథలోకి గోపీ వచ్చారు. సాయి కార్తీక్ ఆ తర్వాత జాయిన్ అయ్యారు. మోహిత్, శ్రీజిత ఘోష్ యాడ్ చేశారు. వచ్చే నెలలో ఈ మూవీ షూటింగ్ ప్రారంభం కానుంది. వీలైనంత త్వరగానే ఈ చిత్రాన్ని ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తామ్మని అన్నారు...హీరో మోహిత్ పెడాడా మాట్లాడుతూ.. .. మా రిచ్ లాంటి మంచి కథకు మంచి నిర్మాతలు దొరికారు. రాజా గారు అద్భుతంగా కథను రాసుకున్నారు. ఇంటర్వెల్ నెక్స్ట్ లెవెల్లో ఉంటుంది. క్లైమాక్స్‌కి గూస్ బంప్స్ వస్తుంది. యాక్టింగ్ చేస్తూ రాజా గారు కథను అద్భుతంగా నెరేట్ చేశారు...నిర్మాత మార్గం గోపి మాట్లాడుతూ.. మా 'రిచ్' సినిమాని ఈ రోజు ప్రారంభించాం. పద్మనాభ రెడ్డితో కలిసి ఈ మూవీని నిర్మిస్తున్నాం. దర్శకుడు రాజా నరేంద్ర మాట్లాడుతూ.. .. మా రిచ్ ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. సహ నిర్మాత మహేంద్ర గైక్వాడ్ మాట్లాడుతూ.. .నాకు తెలుగు అంతగా రాదు. రిచ్ మూవీని హిందీలోనూ రిలీజ్ చేస్తాం.నటి పూజా కేంద్రే మాట్లాడుతూ.. .. రిచ్ చిత్రంలో నాకు మంచి రోల్ ఇచ్చారు. ఆద్యంత నవ్విస్తూనే ఉంటాను.

# 'ఓ అందాల రాక్షసీ' హీరో షిరాజ్ మెహదీ



తెలుగు చిత్ర పరిశ్రమలో చిన్న సినిమాల పట్ల వివక్ష తీవ్రస్థాయికి చేరిందని, కష్టపడి నిర్మించిన చిత్రాలకు థియేటర్లు ఇవ్వకుండా ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లను నాశనం చేస్తున్నారని ఓ అందాల రాక్షసీ మూవీ మేకర్, హీరో షిరాజ్ మెహదీ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'క్యూబ్, యుఎఫ్ ఒలు దోపిడీ చేస్తున్నాయి".. సెన్సార్ నిబంధనలు, ఏడీసీసీ ప్రాసెస్ పేరుతో చిన్న నిర్మాతల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని షిరాజ్ ఆరోపించారు. క్యూబ్, యుఎఫ్ఒ డిజిటల్ ప్రొవైడర్లు వారానికి రూ. 2,000లో చేసే పనికి ప్రతి థియేటర్ నుండి రూ. 10 వేల నుండి ..12 వేల వరకు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడు తున్నారని మండిపడ్డారు. ఫిల్మ్ ఛాంబర్ తీరుపై మండిపాటు.. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ చిన్న ప్రొడ్యూసర్లకు, డైరెక్టర్లకు అండగా నిలవకపోగా, నల్లుల లాగా నలిపే స్తోందని ధ్వజమెత్తారు. ఐనాక్స్, పివిఆర్, ఏషియన్ ఫిల్మ్స్ వంటి ప్రముఖ మల్టీప్లెక్స్ కాంప్లెక్స్‌లు మొదట థియేటర్లు ఇస్తామని చెప్పి, చివర్లో హ్యాండ్ ఇచ్చారని, దీనిపై చట్టపరంగా నోటీసులు ఇచ్చామని, హైకోర్టు నుండి సమన్లు కూడా వెళ్లాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి.. సినిమా పరిశ్రమలో సాగుతున్న ఈ మాఫియా పోకడలపై తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించాలని, చిన్న సినిమాలకు తగిన రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

# 'అనకాపల్లి' పెద్ద హిట్ అవ్వాలి: వి. వి. వినాయక్



వి.వి. మాట్లాడుతూ లగడపాటి శ్రీధర్‌కి మా అందరికంటే సినిమా పిచ్చి ఎక్కువగా ఉంటుంది. ఆయనకి సినిమా పట్ల ఉన్న ప్యాషన్ గురించి నాకు తెలుసు. విక్రమ్ పెద్ద హీరో అయి శ్రీధర్ కోరికని నెరవేర్చుతాడు. మైత్రి రవి మాట్లాడుతూ.. లగడపాటి శ్రీధర్ మాకు మంచి మిత్రులు. విక్రమ్ పెద్ద హీరో అవ్వాలని కోరుకుంటు న్నాను. తారక్ తన పర్ఫామెన్స్‌తో అందరినీ భయపెడుతున్నాడు. ఈ చిత్రంలో పని చేసిన ప్రతీ ఒక్కరికీ ఆల్ ది బెస్ట్. శ్రీధర్ అన్న ఇంత త్వరగా హీరోని చేస్తాడని అనుకోలేదు. శివ నిర్వాణ మాట్లాడుతూ.. అనకాపల్లితో నాకు మంచి ఎమోషన్ ఉంది. నేను అక్కడే డిగ్రీ చదివాను. నేను కూడా అనకాపల్లి ఎమోషన్ మీద కథ రాయాలని అనుకున్నా. కానీ త్రినాథ్ గారు నాకు ఆ అవకాశం ఇవ్వలేదు.˝అనకాపల్లి చిత్రంతో త్రినాథ్ రావు గారు ప్రయోగం చేశారు. ఇకపై నటుడిగానూ త్రినాథ్ బిజీగా అవుతారని ఆశిస్తున్నాను. సాయి రాజేష్ మాట్లాడుతూ.. .. త్రినాథరావు నిర్మాత, నటిస్తున్నాడు అని తెలియడంతో ఆశ్చర్యపోయాను. ట్రైలర్‌లో ఆయన అద్భుతంగా కనిపించారు. నాయుడు గారు ఇంకా ఇలానే మంచి సినిమాల్ని చేయాలని కోరుకుంటున్నాను. నాకు శ్రీధర్ అంటే చాలా ఇష్టం. ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ.. త్రినాథరావు ఆలోచనకు రూపమే˝అనకాపల్లి. ఈ మూవీని ఆల్రెడీ నేను చూశాను. విక్రమ్ సహిదేవ్ మాట్లాడుతూ.. అనకాపల్లి ఈవెంట్‌కి వచ్చిన మా అతిథులు వినాయక్ గారు, శివ నిర్వాణ , మైత్రి రవి, సాయి రాజేష్ , ఆర్పీ పట్నాయక్ ఇలా అందరికీ థాంక్స్.

# నవంబరు 21న '3.0' సంగీత కచేరీ..



హైదరాబాద్, సెప్టెంబర్ 28, 2026:.. ప్రముఖ గాయని ..కేఎస్ చిత్ర.. మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆమె ప్రతిష్ఠాత్మక ..సంగీత కచేరీ˝చిత్రామృతం 3.0 నవంబర్ 21న.. హైదరాబాద్‌లోని ..నెక్సస్ మాల్ సమీపంలోని నెక్సస్ మాల్ గ్రౌండ్స్‌లో.. జరగనుంది.జోరా మరియు ఎన్ చాట్ మీడియా ఆధ్వర్యంలో ఈ కచేరీ నిర్వహించను న్నారు. హైదరాబాద్‌లో కేఎస్ చిత్ర గారు నిర్వహిస్తున్న ..అతిపెద్ద కచేరీ అని నిర్వాహకులు తెలిపారు. సుమారు 10,000 మంది ప్రేక్షకులు.. ఈ కార్యక్రమానికి హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ..కేఎస్ చిత్ర .. పాల్గొని, తన సంగీత ప్రయాణం, హైదరాబాద్‌తో తనకున్న అనుబంధం, రాబోయే కచేరీ విశేషాలను మీడియాతో పంచుకున్నారు

# 'స్లమ్ డాగ్' జరీనా వహాబ్ టచ్చింగ్ గ్లింప్స్ రిలీజ్



డైనమిక్ ఫిల్మ్‌మేకర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్'. ఈ చిత్రం ప్రమోషనల్ మెటీరియల్ ఇప్పటికే సంచలనం సృష్టించింది. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ తమ పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై జేబీ నారాయణరావు కొండ్రొల్లా జేబీ మోషన్ పిక్చర్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని గ్రాండ్ రూపొందిస్తున్నారు. ఇందులో టబు పవర్ ఫుల్ పోలీస్ అధికారిణి పాత్రను పోషిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం హార్ట్ టచింగ్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో విజయ్ సేతుపతి అమ్మ జుబైదాగా జరీనా వహాబ్ పాత్రను పరిచయం చేశారు. తన జీవితంలో ఎదురైన అత్యంత బాధాకరమైన సంఘటనను జుబైదా గుర్తుచేసుకునే ఎమోష నల్ ఎపిసోడ్‌ను ఈ గ్లింప్స్‌లో చూపించారు. ఒక బిచ్చగాడి జీవితం లో ఎదురయ్యే కఠినమైన, బయట ప్రపంచానికి పెద్దగా తెలియని వాస్తవాలను ఈ సన్నివేశం ఆవిష్కరిస్తుంది. అదే సమయంలో సినిమా కథలోని ప్రధాన భావోద్వేగాన్ని కూడా పరిచయం చేస్తుంది

29-9pg10.qxd:29-9pg10.qxd 1/1/02 6:13 AM Page 1



# ఆసియా క్రీడలు..

## పరుగులో పరుల్‌కు కాంస్యం

### హార్డిల్స్‌లో విద్యకు కాంస్యం

**నగోయా:** ఆసియా క్రీడల మహిళల పరుగు, హార్డిల్స్‌లో వ్యక్తిగత విభాగాల్లో భారత క్రీడాకారిణిలు పరుల్ చౌదరి, విద్యా రామరాజ్‌కు కాంస్య పతకాలు దక్కాయి. సోమవారం జరిగిన మహిళల 5000 మీటర్ల ఫైనల్‌లో పరుల్ 15:14.61 సమయంతో మూడో స్థానంలో నిలిచి, ఆసియా క్రీడల్లో తన రెండో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.







హోరాహోరీ పోరులో పరుల్ తన రేసును సరైన సమయంలో పూర్తిచేసి, చివరి దశలలో వేగంగా దూసుకెళ్లి కజకిస్తాన్‌కు చెందిన నోరా తనుయిని అధిగమించి మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే భారత హార్డిల్స్ క్రీడాకారిణి విద్యా రామ్‌రాజ్ సోమవారం మహిళల 400 మీటర్ల హార్డిల్స్‌లో కాంస్యం గెలుచుకుంది. ఫైనల్‌లో విద్యా 54.75 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసి మూడవ స్థానంలో నిలిచింది. ఈ కాంస్య పతకంతో రామ్‌రాజ్ ఈ ఈవెంట్‌లో వరుసగా రెండవ ఆసియా క్రీడల పతకాన్ని సాధించింది. ఆమె తన మునుపటి వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన అయిన 55.42 సెకన్ల కంటే తన ప్రదర్శనను గణనీయంగా మెరుగుపరుచుకుంది.

## గుల్వీర్‌కు రజతం




**నాగోయా:** భారత క్రీడాకారుడు గుల్వీర్ సింగ్, 10,000 మీటర్ల ఈవెంట్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత, సోమవారం జరిగిన పురుషుల 1500 మీటర్ల ఫైనల్‌లో రెండవ స్థానంలో నిలిచి, ఆసియా గేమ్స్ 2026లో తన పతకాల ఖాతాలో మరో రజత పతకాన్ని చేర్చుకున్నాడు. మరోవైపు, పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అవినాష్ సేబుల్ నాలుగవ స్థానంలో నిలిచి, పతకాన్ని త్రుటిలో కోల్పోయాడు. 1500 మీటర్ల ఫైనల్‌లో గుల్వీర్ 3:36.72 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అతను జపాన్‌కు చెందిన కజుటో ఇజావా, నగియా మోరీల మధ్య స్థానంలో నిలిచాడు. ఇజావా 3:36.35 సెకన్ల ఆసియా క్రీడల రికార్డు సమయంలో స్వర్ణం సాధించగా, భారత క్రీడాకారుడి కంటే కేవలం 0.37 సెకన్లు ముందున్నాడు. కాగా, మోరీ 3:37.92 సెకన్లతో కాంస్యం గెలుచుకున్నాడు.

పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ ఫైనల్‌లో, సేబుల్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ సమయం 8:21.67 సెకన్లను నమోదు చేసినప్పటికీ, 4.31 సెకన్ల తేడాతో పతకాన్ని కోల్పోయి నాలుగో స్థానంలో నిలిచాడు.







## అఫ్ఘాన్, హాంకాంగ్‌లతో

# మ్యాచ్‌లు రద్దు

### ర్యాంకింగ్స్‌తో సెమీస్‌కు టీమిండియా, పాక్

**నిషిన్:** జపాన్‌లోని ఐచినగోయా వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో భాగంగా జరగాల్సిన మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా టీమిండియా, పాకిస్తాన్ జట్లు నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. జపాన్‌లోని నిషిన్ నగరంలో సోమవారం భారత్–ఆఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్–హాంగ్‌కాంగ్ జట్ల మధ్య తొలి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉంది.

అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా కనీసం టాస్ కూడా పడకుండానే ఈ రెండు మ్యాచ్‌లూ పూర్తిగా రద్దయ్యాయి. సోమవారం నాటి మ్యాచ్‌లలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం, తడిసిన ఔట్ ఫీల్డ్ కారణంగా కనీసం టాస్ వేసేందుకు కూడా పరిస్థితులు అనుకూలించలేదు. అధికారులు పలు దఫాలు పరిస్థితిని పరిశీలించినా, ఆట మొదలయ్యే అవకాశం కనిపించలేదు. చివరకు టాస్ లేకుండానే మ్యాచ్‌లకు ముగింపు పలికారు. కాగా గత ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా, ఈ సారి కూడా పసిడి పతకమే లక్ష్యంగా బరిలోకి దిగింది. అయితే స్టేడియంలో ఒక్క బంతి పడకుండానే మ్యాచ్ రద్దయినా నిబంధనల ప్రకారం భారత్, పాకిస్తాన్‌లు టోర్నీలో ముందడుగు వేశాయి.

ఆసియా క్రీడల నిబంధనల ప్రకారం వర్షం వల్ల మ్యాచ్ రద్దయితే రిజర్వ్ డే లేకపోవడంతో ఉన్నత ర్యాంకింగ్ ఉన్న జట్టుకే విజయం దక్కుతుంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో భారత జట్టు 17480 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, పాకిస్తాన్ 13679 పాయింట్లతో 6వ స్థానంలోను, ఆఫ్ఘనిస్తాన్ 8925 పాయింట్లతో 10వ స్థానంలో, హాంకాంగ్ 6634 పాయింట్లతో 24వ స్థానంలో ఉన్నాయి.

కాగా భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్ ఆడే అవకాశం పొందాయి. దీంతో సెమీఫైనల్లో భారత్ ఎవరితో తలపడనుందనేది ఆసక్తికరంగా మారింది. అక్టోబర్ 1న జరగనున్న రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంక, నేపాల్ మధ్య జరిగే మూడో క్వార్టర్ ఫైనల్ విజేతతో భారత్ తలపడనుంది. మరోవైపు హాంగ్‌కాంగ్‌తో మ్యాచ్ వర్షంతో రద్దవ్వడంతో ఇప్పటికే సెమీస్ చేరిన పాకిస్తాన్, అక్టోబర్ 1న బంగ్లాదేశ్ లేదా మలేషియాతో మొదటి సెమీఫైనల్లో పోరాడనుంది.

## కుస్తీలో పింకీకి కాంస్యం

**నగోయా:** సెమీఫైనల్‌లో దక్షిణ కొరియాకు చెందిన మో సుమిన్ చేతిలో ఓటమి పాలైన పింకీ ఆసియా క్రీడల్లో బల్హారా కురాష్ (కుస్తీ) విభాగంలో కాంస్యం గెలుచుకుంది. సోమవారం జరిగిన మహిళల 78 కేజీల కురాష్ ఈవెంట్‌లో పింకీ సెమీఫైనల్‌లో ఈ పతకాన్ని దక్కించుకుంది. 2018 ఆసియా క్రీడల రజత పతక విజేత సుమిన్ చేతిలో 0–5 తేడాతో ఓడిపోయింది. అంతకు ముందు క్వార్టర్ ఫైన ల్‌లో దక్షిణ కొరియాకు చెందిన లిమ్ గరమ్‌ను 3–0



తేడాతో ఓడించిని పింకీ భారత్‌కు పతకా న్ని ఖాయం చేసింది. సెమీఫైనల్ సమయంలో బల్హారాకు ఒక దక్కి (అంటే రెండు హెచ్చ రికలు) అందాయి. ఆ తర్వాత సుమిన్ స్కోర్ చేసి, ఆపై ఒక యోన్ బోష్ (అంటే పూర్తి పాయింట్)ను జోడించి, 5–0 విజయాన్ని పూర్తి చేసింది. క్వార్టర్ ఫైనల్ లో, బల్హారా లిమ్‌పై చాలా స్కోర్ చేయగా, కొరియా క్రీడాకారిణి టాన్‌బెక్ హెచ్చరికను అందుకుంది. కురాష్‌లో భారత్‌కు తొలిరోజు కష్టంగా గడిచింది. పురుషుల +90 కేజీల క్వార్టర్ ఫైనల్‌లో విశాల్, థాయ్‌లాండ్‌కు చెందిన కునతిప్ యేఆన్ చేతిలో 0–5 తేడాతో ఓడిపోయాడు. అలాగే, మహిళల 57 కేజీల రౌండ్ ఆఫ్ 32 బౌట్ లో సంగీతా బల్హారా, ఫిలిప్పీన్స్‌కు చెందిన చార్మియా క్వెలినో చేతిలో 0–10 తేడాతో ఓటమి పాలైంది. మరోవైపు, రౌండ్ ఆఫ్ 16లో భారతి, ఇరాన్‌కు చెందిన తహెరే అజర్‌పెయివాండ్ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల +90 కేజీల రౌండ్ ఆఫ్ 16 బౌట్‌లో యశ్ కుమార్ చౌహాన్, తజికిస్తాన్‌కు చెందిన షకర్మద్ మిర్మామదోవ్ చేతిలో 0–10 తేడాతో ఓడిపోయాడు.



## బాక్సింగ్‌లో అద్భుత విజయంతో

## లవ్లీనాకు పతకం ఖాయం

**నిషియో:** నిషియో జిమ్నాసియంలో సోమవారం జరిగిన మహిళల 75 కేజీల క్వార్టర్ ఫైనల్‌లో దక్షిణ కొరియాకు చెందిన సియోంగ్ సుయోన్‌ను 5–0 తేడాతో ఓడించిన భారత క్రీడాకారిణి లవ్లీనా బోర్గోహైన్, వరుసగా రెండో ఆసియా క్రీడల బాక్సింగ్ పతకాన్ని ఖాయం చేసుకుంది. 2023 హాంగ్‌జౌ గేమ్స్ రజత పతక విజేత సమర్థవంతంగా ఎదురుదాడులతో మొదటి రౌండ్ నుంచే పోటీని తన నియంత్రణలోకి తీసుకుంది.

ఆమె మొదటి రౌండ్‌ను ఏకగ్రీవంగా గెలుచుకుని, రెండవ రౌండ్‌లో కూడా ఆటను తన అదుపులోనే ఉంచుకుంది. ఫైనల్ రౌండ్‌లో బోర్గోహైన్ ఒత్తిడిని కొనసాగించి కొరియా క్రీడాకారిణిపై శక్తివంతమైన కాంబినేషన్‌లను ప్రయోగించింది. ఐదుగురు న్యాయనిర్ణేతలు ఈ బౌట్‌లో లౌవ్లీనాకు అనుకూలంగా 3027 స్కోరు ఇచ్చారు. దీంతో ఆమె సెమీఫైనల్స్‌లో స్థానం ఖరారై, కనీసం కాంస్య పతకం ఖాయమైంది. అలాగే పురుషుల 80 కేజీల విభాగంలో తజికిస్థాన్‌కు చెందిన నెక్రూజ్ సాలిమోవ్‌పై 5–0తో ఏకగ్రీవ నిర్ణయంతో అంకుష్ పంఘల్ భారత్‌కు పతకాన్ని ఖాయం చేశాడు. మహిళల 65 కేజీల విభాగంలో, పర్వీన్ హుడా ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నవబఖోర్ ఖమిడోవాను 5–0 తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది.

## షూటింగ్‌లో ఈషాకు రజతం

**టయోటా:** ఆసియా గేమ్స్ 2026 మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో రజత పతకం గెలిచి ఈషా సింగ్ భారత్‌కు పతకాన్ని అందించింది. సోమవారం జరిగిన ఈవెంట్ క్వాలిఫికేషన్‌లో 580 పాయింట్లు, 22 బుల్‌సైలతో ఎనిమిదో స్థానంలో నిలిచిన ఈషా, 580 పాయింట్లు సాధించి 20న చేసిన చైనీస్ తైపీకి చెందిన యెన్‌చింగ్ చెంగ్‌ను అధిగమించి వ్యక్తిగత ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఫైనల్‌లో, ఈషా పలు షూట్‌ఆఫ్‌ల ద్వారా పోరాడి, చివరకు 38 హిట్‌లతో చైనాకు చెందిన జియావో



జియారుయి జువాన్‌తో సమంగా నిలిచింది. నిర్ణయాత్మక షూట్ ఆఫ్‌లో జియావో గెలుపొందడంతో, ఈషా రజత పతకంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. కాగా ఈషా, డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్, ఆసియా క్రీడల రజత పతక విజేత రాహి సర్నోబత్‌లతో కూడిన భారత జట్టు 1727–56న సంయుక్త స్కోరుతో ముగించింది. ప్రెసిషన్ దశ తర్వాత, చైనా కంటే కేవలం ఒక పాయింట్ వెనుకబడి ఉన్నప్పుడు, టీమ్ ఈవెంట్ ప్రారంభంలో భారత్‌కు ఆశాజనకంగా కనిపించింది. అయితే, ప్రారంభ ర్యాపిడ్ సిరీస్‌లో రాహి తడబడగా, ఈషా, మను బలమైన స్కోర్లు సాధించారు.

ఆ తర్వాత జరిగిన సిరీస్‌లలో మెరుగ్గా ఆడి రాహి కోలుకున్నప్పటికీ, ఆరంభంలో ఎదురైన ఎదురుదెబ్బ భారీ మూల్యం చెల్లించేలా చేసింది. దీంతో టీమ్ ఈవెంట్‌లో పతకం లేకుండానే ముగిశాయి.

# ఇన్వెస్టర్ల సంపద రూ.8లక్షల కోట్లు ఆవిరి

### భారీ నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి,సెప్టెంబరు 28:** ఇరాన్–అమెరికా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడం, సరఫరా అంతరాయాలు సుదీర్ఘమయ్యే అవకాశాలపై ఆందోళనలు దేశీయ స్టాక్ మార్కెట్లను తీవ్రంగా దెబ్బతీశాయి. దీనికి తోడు అమెరికా ట్రెజరీ రిటర్నులు పెరగడం, రూపాయి బలహీనపడటం, విదేశీ పెట్టుబడిదారులు వరుసగా పెట్టుబడులు ఉపసంహరించుకోవడం, ఆసియా మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు మార్కెట్లపై ఒత్తిడిని మరింత పెంచాయి. ఒక్కసారిగా బిఎస్ఇలో ఇన్వెస్టర్ల సంపద ఎనిమిది లక్షలకోట్లు ఆవిరికాగా బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.474 లక్షల కోట్లకు పడిపోయింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 107 డాలర్లకు చేరువ కావడం, అమెరికా 10 ఏళ్ల ట్రెజరీ ఈల్డ్ 5.2 శాతాన్ని దాటడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా నిఫ్టీ 22,800 స్థాయి దిగువన ముగిసింది. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగియగా బ్యాంకింగ్, రియల్టీ, మెటల్ షేర్లలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి.బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1,124 పాయింట్లు నష్టపోయి 72,771.72వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 360.25 పాయింట్లు క్షీణించి 22,780.25 వద్ద స్థిరపడింది.నిఫ్టీని ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు దిగజార్చాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.32 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.25 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.87 శాతం నష్టపోయాయి.బీఎస్ఈ మిడ్‌క్యాప్ 150 సూచీ, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 250సూచీలు చెరో 1.62 శాతం క్షీణించాయి. బీఎస్ఈలో మొత్తం 1,271 షేర్లు లాభపడగా 3,218 షేర్లు నష్టపోయాయి. మరో 245 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ నవంబర్ 2026 ఫ్యూచర్స్ ధర 3.54 డాలర్లు శాతం పెరిగి బ్యారెల్‌కు 100.98 డాలర్లకు చేరింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ 0.93 శాతం పెరిగి 5.235 శాతానికి చేరింది. భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ కూడా 7.120 శాతం నుంచి 7.177 శాతానికి పెరిగింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే తగ్గింది. రూపాయి మారకం 96.0100 వద్ద ట్రేడవుతోంది. గత సెషన్‌లో ఇది 95.7500 వద్ద ముగిసింది.ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్ బంగారం ఫ్యూచర్స్ 2.14 శాతం తగ్గి రూ.1,47,490కు చేరాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 1.99 శాతం క్షీణించి 54,471.65 వద్ద ముగిసింది.యెస్ బ్యాంక్ 5.87 శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 4.69 శాతం, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 3.88 శాతం, కెనరా బ్యాంక్ 3.47 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 3.43 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా 3.30 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.25 శాతం, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 2.23 శాతం, ఎస్‌బీఐ 2.14 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.87 శాతం నష్టపోయాయి. అయితే ఫెడరల్ బ్యాంక్ 0.93 శాతం లాభపడింది. సోమ్ డిస్టిలరీస్ అండ్ బ్రూవరీస్ 9.20 శాతం పెరిగింది.లుపిన్ 1.43 శాతం తగ్గింది.సిల్వర్ టచ్ టెక్నాలజీస్ 0.40 శాతం లాభపడింది. కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్: 0.95 శాతం క్షీణించింది.జ్యోతి సిఎన్‌సి ఆటోమేషన్: 1.98 శాతం పడిపోయింది.

## ఆగస్టులో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి 8%

### తయారీ, విద్యుత్ రంగాల దూకుడుతో 60 బేసిస్ పాయింట్లు పెరుగుదల



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** దేశ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి ఆగస్టు నెలలో 8 శాతానికి వేగం పుంజుకుంది. జూలైలో నమోదైన సవరించిన 7.4 శాతం వృద్ధితో పోలిస్తే ఇది 60 బేసిస్ పాయింట్ల అధికం. తయారీ, విద్యుత్ రంగాల పనితీరు మెరుగుపడటం ఇందుకు ప్రధాన కారణమని సోమవారం విడుదల చేసిన జాతీయ గణాంకాల కార్యాలయం గణాంకాలు వెల్లడించాయి.ఆగస్టు పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 123.3గా నమోదైంది. జూలైలో ఇది 125.6గా ఉండగా, గత ఏడాది ఆగస్టులో 114.2గా ఉంది. 29 నెలల్లో ఇది రెండో అత్యధిక పారిశ్రామిక వృద్ధి. జూన్‌లో 8.8 శాతం వృద్ధి నమోదైంది.తయారీ రంగంలో 9 శాతం వృద్ధి ఐఐపీ సూచీలో సుమారు 76 శాతం వాటా కలిగిన తయారీ రంగం వృద్ధి జూలైలోని సవరించిన 8.2 శాతం నుంచి ఆగస్టులో 9 శాతానికి పెరిగింది. 29 నెలల్లో ఇది ఈ రంగానికి రెండో అత్యధిక వృద్ధి.

## లక్ష కోట్ల విలువైన బాండ్ల విక్రయం: ఆర్బీఐ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో అధికంగా ఉన్న నగదు లభ్యతను తగ్గించేందుకు రిజర్వుబ్యాంకు భారీగా ప్రభుత్వ బాండ్లనువిక్రయిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు దాదాపు రూ.1లక్ష కోట్ల విలువైన బాండ్లను నికరంగా విక్రయించినట్లు ట్రెజరీ అధికారులు తెలిపారు. గత దశాబ్దానికి పైగా కాలంలో ఒక ఆర్థికసంవత్సరంలో నమోదైన అత్యధిక నికర బాండ్ విక్రయాలు ఇవేనని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. డిసెంబర్ నాటికి ఈ మొత్తం మరో రూ 1లక్ష కోట్లు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.ప్రత్యేక విండో ద్వారాబ్యాంకులు డాలర్లను సమీకరించుకునేందుకు ఆర్‌బీఐ అనుమతించడంతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా రూపాయి లిక్విడిటీ వచ్చింది. ఇది దేశ విదేశీ మారక నిల్వలకు మద్దతుతోపాటు చమురు ధరలు పెరిగిన సమయంలో రూపాయికి కొంత ఊరటని చ్చింది.అయితే అధిక లిక్విడిటీ కారణంగా ఓవర్‌నైట్ వడ్డీరేట్లు ఆర్‌బీఐపాలసీ రేటు కంటే దిగువకు పడిపోయాయి.

## ఐపిఓల జోరు..మనీవ్యూ ఇష్యూకు 98.44 రెట్లు సబ్‌స్క్రిప్షన్




**ముంబయి, సెప్టెంబరు 28:** ప్రైమరీ మార్కెట్‌లో ఎస్ఎంఈ కంపెనీల ఐపీఓలకు ఇన్వెస్టర్ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద నమోదైన వివరాల ప్రకారం మనీవ్యూ ఐపీఓకు భారీగా స్పందన లభించగా, ఏవన్ స్టీల్స్ ఇండియా, ఓరియంట్ కేబుల్స్, జర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్ ఇష్యూలు కూడా బలమైన సబ్‌స్క్రిప్షన్‌ను నమోదు చేశాయి.షా ఇన్వెస్టర్స్ హోమ్‌షా ఇన్వెస్టర్స్ హోమ్ ఐపీఓకు 37,79,440 షేర్లకు గాను 11,72,320 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 0.31 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. షేర్ ధరల శ్రేణిని రూ.159–167గా నిర్ణయించారు. కనీసం 85 షేర్లకు, ఆ తర్వాత అదే గుణితాల్లో బిడ్ చేయాల్సి ఉంటుంది.ఎస్ఆర్ఐటీ ఇండియాఎస్ఆర్ఐటీ ఇండియా ఐపీఓకు 1,17,60,000 షేర్లు ఆఫర్ చేయగా 1,17,17,925 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 1 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.123–130గా ఉంది. కనీసం 115 షేర్లకు బిడ్ చేయాలి.ఏవన్ స్టీల్స్ ఇండియాఏవన్ స్టీల్స్ ఇండియా 73,84,934 షేర్లకు గాను ఏకంగా 8,55,60,909 షేర్లకు బిడ్లు వచ్చి11.59 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఐపీఓ ధరల శ్రేణి రూ.385–405గా ఉంది. కనీసం 37 షేర్లకు బిడ్ చేయాలి. మనీవ్యూమనీవ్యూ ఐపీఓలో 23,25,24,175 షేర్లకు గాను 22,88,93,42,070 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 98.44 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.32–34గా నిర్ణయించారు. కనీసం 441 షేర్లకు, ఆ తర్వాత అదే గుణితాల్లో బిడ్ చేయాల్సి ఉంటుంది. ఎస్‌వెక్టర్ ఐపీఓకు 7,42,29,166 షేర్లు ఆఫర్ చేయగా 8,33,05,404 షేర్లకు బిడ్లు వచ్చాయి. ధరల శ్రేణి రూ.30–32గా ఉంది. రన్‌వాల్ ఎంటర్‌ప్రైజెస్ ఐపీఓకు 1,21,11,294 షేర్లకుగాను 85,16,837 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 0.70 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.290–305గా ఉంది. జర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్ ఐపీఓకు 1,60,62,879 షేర్లకు గాను 8,25,13,478 షేర్లకు బిడ్లు వచ్చాయి. ధరల శ్రేణి రూ.132–139గా ఉంది. ఓరియంట్ కేబుల్స్ (ఇండియా) ఐపీఓకు 1,49,76,743 షేర్లు ఆఫర్ చేయగా 12,29,17,355 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 8.21 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.258–272గా ఉంది.

# టాటాసన్స్ లిస్టింగ్‌కు టాటాట్రస్ట్‌నో..





**ముంబయి, సెప్టెంబరు 28:** టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌ను పబ్లిక్ లిస్టింగ్ నుంచి తప్పించేందుకు టాటా ట్రస్టులు పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి. టాటా సన్స్‌లో 66 శాతం వాటా కలిగిన టాటా ట్రస్టులు టాటా ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ సొల్యూషన్స్, టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్ సంస్థలను టాటా సన్స్‌లో విలీనం చేయాలని ప్రతిపాదించాయి.ఈ విలీనం పూర్తయితే పునర్వ్యవస్థీకరించిన టాటా సన్స్ నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ లేదా కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీగా పరిగణించాల్సిన నియంత్రణ ప్రమాణాలకు లోబడి ఉండదని టాటా ట్రస్టులు చెపుతున్నాయి. దీంతో టాటా సన్స్‌ను లిస్టెడ్ కంపెనీగా మార్చాల్సిన అవసరం లేకుండా, అన్‌లిస్టెడ్ ప్రైవేట్ కంపెనీగా కొనసాగించే అవకాశం ఏర్పడుతుందనిభావన.ఈ ప్రతిపాదనను టాటా సన్స్ బోర్డు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని టాటా ట్రస్టులు కోరాయి. ముఖ్యంగా విలీనానికి ముందు ఆర్బీఐ నుంచి ఎన్వోసీ పొందాలని సూచించాయి. ఆర్‌బీఐ టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ ఎన్‌బిఎఫ్‌సిగా వర్గీకరించింది. ఈ హోదా కారణంగా నియంత్రణ నిబంధనల ప్రకారం కంపెనీ లిస్టింగ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే టాటా సన్స్ ఎన్‌బిఎఫ్‌సి వ్యవస్థ నుంచి బయటకు రావాలని ఆర్‌బీఐని కోరినా ఆ అభ్యర్థనను తిరస్కరించడంతో లిస్టింగ్ అంశం మరోసారి కీలకంగా మారింది.ఈ నేపథ్యంలో టాటా ట్రస్టులు తాజా పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనను తీసుకొచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ప్రతిపాదిత విలీన సంస్థకు మొత్తం రూ.1,05,043 కోట్ల ఆపరేటింగ్ ఆదాయం ఉండేదని టాటా ట్రస్టుల ప్రతిపాదన పేర్కొంది. ఇది మొత్తం ఆదాయంలో 64.3 శాతానికి సమానం. అదే సమయంలో ఆర్థిక ఆస్తుల నుంచి వచ్చే ఆదాయం రూ.40,072 కోట్లుగా ఉండేది.పునర్వ్యవస్థీకరించిన సంస్థ నికర ఆస్తులు రూ.2,00,158 కోట్లు ఉండగా, అందులో గ్రూప్‌కంపెనీల్లో పెట్టుబడులు రూ. 1,77,120 కోట్లుగా ఉంటాయి. ఇది మొత్తం నికర ఆస్తుల్లో 90శాతం కంటే తక్కువ. టాటా ట్రస్టుల తాజా ప్రతిపాదనకు టాటా సన్స్ బోర్డు ఆమోదం, ఆర్‌బీఐ అనుమతి, విలీన ప్రక్రియ పూర్తవడం వంటి అనేక దశలు ఉన్నాయి. ఇవన్నీ పూర్తయిన తర్వాతే ప్రతిపాదిత పునర్వ్యవస్థీకరణ అమల్లోకి వస్తుంది. టాటా ట్రస్టుల ప్రకారం, ఈ నిర్మాణం టాటా గ్రూప్ సంప్రదాయ సంస్థాగత నమూనాను కొనసాగించడంతో పాటు నియంత్రణనిబంధనలను పాటించేలా చేస్తుంది. అదే సమయంలో టాటా సన్స్‌ను అన్‌లిస్టెడ్ ప్రైవేట్ హోల్డింగ్ కంపెనీగా కొనసాగించేందుకు అవకాశం కల్పిస్తుంది.

## ఆర్బీఐ రెపోరేట్ల పెంపు పరిమితమే: నోమురా



**ముంబయి, సెప్టెంబరు 28:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ రానున్న రోజుల్లో భారీ స్థాయిలో వడ్డీ రేట్లను పెంచే అవకాశం లేదని, పరిమిత స్థాయిలోనే ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే అవకాశం ఉందని గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ నోమురా అంచనా వేసింది. ప్రస్తుతం మార్కెట్లు వచ్చే ఏడాది కాలంలో దాదాపు 125 బేసిస్ పాయింట్ల వడ్డీ రేట్ల పెంపును అంచనా వేస్తున్నప్పటికీ, ఆ స్థాయిలో కఠిన చర్యలు ఉండకపోవచ్చని తెలిపింది. ద్రవ్యోల్బణం విస్తృతంగా ఆర్థిక వ్యవస్థ అంతటా వ్యాపిస్తున్న సంకేతాలు లేవని ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పరిమితమేనని అంచనావేసింది. భారత్‌లో ట్రెండ్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని నోమురా తెలిపింది. తమ ఇన్‌ఫ్లేషన్ జనరలైజేషన్ ఇండెక్స్ కూడా దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు విస్తృతంగా పెరుగుతున్నట్లు ఎలాంటి సంకేతాలు ఇవ్వడం లేదని పేర్కొంది. నోమురా రూపొందించిన ముందస్తు సూచీ రానున్న కాలంలో ఆర్థిక వృద్ధి సాధారణ స్థాయి కంటే దిగువన ఉండే అవకాశాన్ని సూచిస్తోందని తెలిపింది. ఆహారం, ఇంధన ధరల ప్రభావంరానున్న ఆరునెలల్లో ఆహారం, ఇంధన ధరల పెరుగుదల కార ణంగా హెడ్‌లైన్ ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉందని నోమురా అంచనా వేసింది. 2027లో వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం 5.2శాతంగా ఉండవచ్చని 2028లో ఇది ఆర్‌బీఐ నిర్దేశించిన 4 శాతం మధ్యస్థ లక్ష్యానికి చేరువయ్యే అవకాశంఉందని పేర్కొంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు విస్తృతంగా వ్యాపిస్తున్న సంకేతాలు పరిమితంగా ఉన్నందున, పూర్తిస్థాయి కఠిన ద్రవ్య విధానం వచ్చే అవకాశం తక్కువని నోమురా పేర్కొంది. అక్టోబర్, డిసెంబర్ నెలల్లో ఆర్‌బీఐ ఒక్కోసారి 25 బేసిస్ పాయింట్ల చొప్పున రెపో రేటును పెంచవచ్చని నోమురా అంచనా వేసింది. దీంతో తుది రెపో రేటు 5.75 శాతానికి చేరుకోవచ్చని తెలిపింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.